# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం -2, అక్టోబర్ - 2026 balagamtv100@gmail.com పేజీలు-8


## చెక్‌పవర్ పై ప్రభుత్వం కీలక నిర్ణయం



వివరాలు 4లో..



## వ్యాపార సంస్థలపై తీవ్రమైన

# సైబర్ ప్రభావం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 01 :** దేశంలో సైబర్ దాడుల ముప్పు ఏ స్థాయిలో ఉందో తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. గత 12 నెలల్లో 96 శాతం భారత సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను ప్రభావితం చేసే సైబర్ ఘటనలను ఎదుర్కొన్నట్లు టెక్నాలజీ సంస్థ సిస్కో విడుదలచేసిన తెలిపింది. వీటిలో మూడింట ఒక వంతుకుపైగా ఘటనల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత దాడుల ప్రభావం ఉన్న ట్లు నివేదిక పేర్కొంది. యితే భారతదేశంలోని వ్యాపార సంస్థలు తీవ్రమైన సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కొంటున్నాయని 'సిస్కో' తన నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 96% భారతీయ వ్యాపార సంస్థలు సైబర్ దాడులకు గురయ్యాయని, దీనివల్ల వాటి దైనందిన కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలిగిందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. భారతదేశంలోని వ్యాపార సంస్థల్లో కేవలం 8% సంస్థలు మాత్రమే అత్యుత్తమ సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలను సాధించగలిగాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత సైబర్ బెదిరింపులను త్వరగా గుర్తించడంలో ఎంతగానో దోహదపడుతున్నప్పటికీ, కేవలం 40% సంస్థలు మాత్రమే ఏజెంట్లను ఉపయోగిస్తున్నాయి.

మిగతా 3లో..

## మా ఆస్తులు.. మీ ఆస్తులు..

# విచారణకు సిద్ధమా?

- తప్పు తేలితే శిక్షకు సిద్ధం.. నువ్వు సిద్ధమా..!?
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు రెడీ
- సిఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి సిద్ధమా?
- రేవంత్ ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్
- రాష్ట్రంలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు
- ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయారా!
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 01 :** తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి

మిగతా 3లో..

## అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన



- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోన్న కమల దళం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకూ సంసిద్ధమైన బీజేపీ
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్య టనలు

మిగతా 2లో..

## ఫారం- 6లో మార్పులకు

# ఎవరు ఆదేశించారు?

- సర్ ప్రక్రియతో ప్రజాస్వామ్యం పూర్తిగా ధ్వంసం
- సీఈసీ రాజీనామా చేసి అపూర్వర్గా మారాలి
- మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్ పై విచారణ జరపాలి
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్
- ఈసీపై మరోసారి రాహుల్ గాంధీ ప్రశ్నల వర్షం
- నేటినుండి సర్‌పై ఇండియా కూటమి ఆందోళనలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 01 :** అసలు ఫామ్ 6లో మార్పులకు ఆదేశాలు ఎవరి నుంచి వెళ్లాయి, ఎవరు వీటిని ఆమోదించారు, ఇందులో సాఫ్ట్ వేర్ నిర్వహిస్తున్న టీసీఎస్ పాత్ర ఎంత అన్న అంశాలు కూడా తెరపైకి వస్తున్నాయి. వీటిపై ఇవాళ విపక్ష నేత రాహుల్ గాంధీ ఈసీతో పాటు టీసీఎస్ ను కూడా ప్రశ్నిస్తూ ఓ ట్వీట్ చేశారు. ఇందులో ఫామ్ 6లో చేసిన మార్పులకు ఎవరి నుంచి ఆదేశాలు వెళ్లాయి, వాటిని ఎవరు

మిగతా 3లో..

## సీఈసీ రాజీనామా

# చేయాల్సిందే..

- లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక
- నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు
- శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ ర్యాలీ
- సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 01 :** ఎన్నికల నిర్వహణ, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం ద్వారా అధికార బీజేపీకి ప్రయోజనం చేకూరుస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని

మిగతా 3లో..

## ఎన్నికల కమిషన్ కార్యాలయం తగలబడిపోతది



- హైదరాబాద్‌లో మాత్రం మాములుగా ఉండదు..
- ఓట్లు పునరుద్ధరించుకుంటే ఊరుకొనేది లేదు
- దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు

మిగతా 2లో..

## యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ



- ప్రతి ఉద్యోగి పేదల ఆవేదనను అర్థం చేసుకోవాలి
- సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల లక్ష్యం
- ఢిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని

**న్యూఢిల్లీ, అక్టోబర్ 01 :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని

మిగతా 3లో..

## ఖైరతాబాద్ ఉప ఎన్నికకు తాత్కాలిక బ్రేక్

- నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం
- ఖైరతాబాద్ ఉపఎన్నిక విజయారెడ్డి పిటిషన్
- నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆదేశించాలని వినతి




**హైదరాబాద్, అక్టోబర్ 01 :** హైకోర్టులో పిటిషన్ పై తుది పరిష్కారం వచ్చేంత వరకూ ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి బై పోల్ నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం చేసింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణ ప్రక్రియపై విచారణ తేలేంత వరకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు అయింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో దానం నాగేందర్ ఎన్నికల కమిషన్? కు సమర్పించిన అఫిడవిట్? లో తప్పుడు సమాచారం ఇచ్చారని.. ఈ మేరకు ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ 2024 జనవరిలోనే విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ సింగిల్ బెంచ్? జడ్జి వద్ద పెండింగ్? లో ఉందని విజయారెడ్డి తరఫు న్యాయవాది సీజే ధర్మాసనం దృష్టికి తాజాగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో దానిపై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప

మిగతా 2లో..

## దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

- శివుడు, శ్రీరాముడిని వేరు చేసి వ్యాఖ్యలా?
- ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు
- సీఎం వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

మిగతా 3లో..



## ఎర్రవల్లి భూ సర్వే నివేదిక సిద్ధం



- 325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల పరిశీలన
- 244 మంది అనుభవదారులకు నోటీసులు
- ప్రభుత్వానికి అందజేయనున్న అధికారులు

మిగతా 3లో..

## హెచ్‌డీఎఫ్‌సీ ఎండీ, సీఈవోగా అనుప్ బగ్చీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 01 : దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీకి నూతన సారథి రానున్నారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా అనుప్ బగ్చీని నియమిస్తున్నట్లు బ్యాంక్ బోర్డు ప్రకటించింది. ప్రస్తుత ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అనుప్ బగ్చీ నియామకంతో పాటు ఆయన వేతన ప్యాకేజీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అక్టోబర్ 1న ఆమోదం తెలిపింది. ఆయన 2026 అక్టోబర్ 27 నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. బగ్చీ పదవీకాలం 2029 అక్టోబర్ 26న ముగుస్తుంది. ప్రస్తుత సీఈవో శశిధర్ జగదీశన్ పదవీకాలం 2026 అక్టోబర్ 26తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం ఖరారైంది. ఐఐటీ కాన్పూర్, ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన అనుప్ బగ్చీకి బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. గతంలో ఆయన ఐసీఐసీఐ గ్రూప్‌లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవోగానూ ఆయన సేవలందించారు. బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవం కలిగిన బగ్చీ నాయకత్వంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరింత పురోగతి సాధిస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## వచ్చే ఎన్నికల వరకు రేవంత్, మహేష్ కలిసి ఉంటారా?

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఎద్దేవా



హైదరాబాద్, అక్టోబర్ 01 : తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వచ్చే ఎన్నికల వరకు రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ జోడీ ఉంటుందా? అని సూటిగా ప్రశ్నించారు. వీరి జోడీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వీళ్లు గొప్పగా చెప్పుకుంటున్నారని... వీళ్లు ఎన్ని రోజులు కలిసుంటారో వీళ్లకే తెలియదని ఎద్దేవా చేశారు. ఈయన పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉంటాడో లేదో ఆయనకు తెలియదని... ఆయన సీఎంగా ఉంటాడో లేదో ఈయనకు తెలియదని అన్నారు. మీ జోడీ, మీ పేర్లు చూసి జనాలు ఓట్లు వేసినట్టయితే... 2023 ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో 7 నియోజకవర్గాలుంటే ఒక్కటైనా గెలిచావా రేవంత్ రెడ్డీ? అని ప్రశ్నించారు.

## యూట్యూబర్ రావణ్‌కు షాక్

- దర్యాప్తు గడువు మరో 30 రోజుల పొడిగింపు



హైదరాబాద్, అక్టోబర్ 01 : యూట్యూబర్ రావణ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద నమోదైన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు గడువును మరో 30 రోజుల పాటు పొడిగిస్తూ కృష్ణా జిల్లా కోర్టు ఈరోజు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, ప్రశ్న రావణ్‌పై నమోదైన ఉపా కేసులో చట్ట ప్రకారం నిర్దేశించిన 90 రోజుల దర్యాప్తు గడువు రేపటితో (అక్టోబర్ 2) ముగియనుంది. ఈ నేపథ్యంలో, కేసులో మరింత లోతైన విచారణ జరిపి, కీలక ఆధారాలు సేకరించేందుకు అదనపు సమయం అవసరమని దర్యాప్తు అధికారులు భావించారు. ఈ మేరకు గడువును పొడిగించాలని కోరుతూ కృష్ణా జిల్లా కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం, దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిని అంగీకరించింది. విచారణ పూర్తి చేయడానికి మరో 30 రోజుల గడువు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. రావణ్ మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని, సాయుధ విప్లవానికి మద్దతు ఇస్తున్నాడని జనసేన నేత ఒకరు చేసిన ఫిర్యాదు మేరకు జూలై నెలలో పోలీసులు రావణ్‌ను అరెస్టు చేసి ఉపా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వులతో దర్యాప్తు అధికారులు విచారణను కొనసాగించి, తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

## వేగంగా వచ్చి ఏడుగురిని ఢీకొట్టిన కారు!

- సీసీటీవీ ఆధారంగా నిందితుడు గుర్తింపు, అరెస్ట్



హైదరాబాద్, అక్టోబర్ 01 : కుషాయిగూడలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈసీఐఎల్‌లోని న్యూ చైతన్య కాలేజ్ సమీపంలో దేవి మొబైల్ షాప్ ఎదురుగా నడుచుకుంటూ వెళ్తున్న ఏడుగురిని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు గాయపడగా.. ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం..కారు వెనుక నుంచి వేగంగా వచ్చి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారిని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కొందరు రోడ్డుపై ఎగిరిపడినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపిస్తోంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ప్రమాదంలో అజయ్ కుమార్, బిపిన్ కుమార్ యాదవ్, రాకేష్ యాదవ్ తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను తొలుత శ్రీకర రాఘవేంద్ర ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సూర్యా ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే కారు ఆపకుండా డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన కుషాయిగూడ పోలీసులు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో పవన్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కారును నడిపినట్లు పోలీసులు గుర్తించి అతడిని అరెస్ట్ చేసినట్లు సమాచారం. ప్రమాద సమయంలో పవన్ మద్యం సేవించి ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. అతనితో పాటు కారులో మరో వ్యక్తి కూడా ఉన్నట్లు సమాచారం. నిన్న తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో మొత్తం ఏడుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు తెలిసింది. కాగా.. ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వేగంగా వచ్చిన కారు ఒక్కసారిగా పాదచారులను ఢీకొట్టిన దృశ్యాలు అందులో కనిపించడంతో ఈ వీడియో చూసిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వృద్ధురాలిని హత్య చేసిన మనుమడు




హైదరాబాద్, అక్టోబర్ 01 : బంధాలు బుగ్గవుతున్నాయి.. మానవత్వం మంటగలుస్తోంది. ఆప్యాయంగా ఒడిలో దాచుకున్న చేతులే.. చివరకు ఆ గొంతును నులిమాయి. వృద్ధాప్యంలో తనకు ఆసరాగా ఉంటాడనుకున్న వాడే.. కాసుల కక్కుర్తితో కాలయముడయ్యాడు. ఇంటి ఈఎంఐలు చెల్లించేందుకు తనకు జోలపాడిన నానమ్మనే హత్య చేసిన మనుమడి ఘాతుకం యాదాద్రి భువనగిరి జిల్లాలో కలకలం రేపింది.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటకు చెందిన యాదమ్మకు వివాహమైన ఆరు నెలలకే భర్తతో విభేదాలు వచ్చాయి. అప్పటి నుంచి ఆమె తన పుట్టిన ఊరైన తూప్రాన్‌పేటలోనే ఒంటరిగా జీవిస్తోంది. వృద్ధాప్యంలో ఉన్న యాదమ్మను ఆమె మేనల్లుడి కుమారుడు రాజు తరచూ చూసుకునేవాడు. దీంతో యాదమ్మకు రాజుపై నమ్మకం పెరిగింది.రాజు పాల వ్యాపారం చేసేవాడు. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే ఉద్దేశంతో ఇటీవల తూప్రాన్‌పేట బ్యాంకు కాలనీలో రూ.36 లక్షల బ్యాంకు రుణంతో ఇల్లు కొనుగోలు చేశాడు. అయితే నెలనెలా ఈఎంఐలు చెల్లించడం అతడికి భారంగా మారింది. రుణ వాయిదాలు చెల్లించాలంటూ బ్యాంకు నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో యాదమ్మ వద్ద బంగారం, వెండి ఆభరణాలు ఉన్న విషయం రాజుకు తెలిసింది. వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టి ఈఎంఐలు చెల్లించేందుకు సహాయం చేయాలని యాదమ్మను కోరాడు. అయితే ఆ నగలు కుటుంబ సభ్యులందరికీ చెందుతాయని, తాను వాటిని ఇవ్వలేనని యాదమ్మ స్పష్టం చేసింది. యాదమ్మ తనకు సహకరించకపోవడంతో రాజు ఆగ్రహానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. నగల కోసం ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. తాడుతో యాదమ్మ గొంతు నులిమి హత్య చేసి.. ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. యాదమ్మ (70) గత నెల 27న ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లోని బంగారు నగలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. మేనల్లుడు దర్శన్ ఇచ్చిన ఫిర్యాదుతో చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నివేదికలో యాదమ్మది సహజ మరణం కాదని.. హత్యగా తేలడంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.హత్య అనంతరం రాజు వ్యవహారశైలిపై పోలీసులకు అనుమానం వచ్చింది. సాధారణంగా యాదమ్మతో తరచూ మాట్లాడే రాజు.. ఘటన తర్వాత ఆమెకు దూరంగా ఉండటం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో అతడి కాల్‌డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. దీంతో రాజుపై అనుమానాలు మరింత బలపడ్డాయి. రాజును అదుపులోకి తీసుకుని విచారించగా.. నగల కోసమే యాదమ్మను హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి 5.6 తులాల బంగారం, వెండి ఆభరణాలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి వెల్లడించారు. నమ్మిన మనిషే.. తన జీవితానికి చివరి రోజుల్లో అండగా నిలవాల్సిన వాడే.. నగల కోసం ప్రాణం తీసిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# హైదరాబాద్‌లో యువతులతో హైటెక్ దందా..!



హైదరాబాద్, అక్టోబర్ 01 : హైదరాబాద్ గచ్చిబౌలిలో హోటల్ కేంద్రంగా సాగుతున్న హైటెక్ వ్యభిచార వ్యవహారాన్ని పోలీసులు ఛేదించారు. విదేశీ మహిళలను నగరానికి తీసుకొచ్చి హోటల్‌లో వేర్వేరు గదులు ఏర్పాటు చేసి వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో గచ్చిబౌలి పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులు సంయుక్తంగా డ్రీమ్ ఫ్రైడ్ హోటల్‌పై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఢిల్లీకి చెందిన నిఖిల్, రామ్మోహన్‌రెడ్డితో పాటు హర్షిత్ సింఘానియాను అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు హోటల్‌లో ఉన్న ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో నిఖిల్ ప్రధాన నిర్వాహకుడిగా వ్యవహరించినట్లు గుర్తించగా, అతడికి రామ్మోహన్‌రెడ్డి సహకరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. దాడుల సందర్భంగా హోటల్‌లో సోదాలు నిర్వహించిన పోలీసులు రూ.13 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. రామ్మోహన్‌రెడ్డి వద్ద ఉన్న రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేసి, వాటిలోని సమాచారాన్ని పరిశీలిస్తున్నారు. పోలీసుల విచారణలో పట్టుబడిన ముగ్గురు మహిళలు కొద్దిరోజుల క్రితమే హైదరాబాద్‌కు వచ్చినట్లు వెల్లడైనట్లు సమాచారం. వారి పాస్‌పోర్టులు, వీసాలను పరిశీలించగా అవి చెల్లుబాటులో ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే, హైదరాబాద్ నగరానికి వచ్చిన తర్వాత వారు ఎవరిని సంప్రదించారు.. హోటల్‌లో గదులు ఎవరు ఏర్పాటు చేశారు.. విదేశీ మహిళలను ఈ వ్యవహారంలోకి ఎవరు తీసుకొచ్చారు..? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా విటులను సంప్రదించి హోటల్‌కు రప్పించారా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది. స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలోని కాల్ వివరాలు, సందేశాలు, ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలించడం ద్వారా ఈ వ్యవహారం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కేసులో ఎవరెవరి ప్రమేయం ఉంది..? ఇంకా ఎంతమంది ఉన్నారనే విషయాలను గచ్చిబౌలి పోలీసులు ఆరా తీస్తున్నారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

# అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- ఖైరతాబాద్ ఉప ఎన్నికకూ సంసిద్ధమైన బీజేపీ
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్య టనలు



హైదరాబాద్, అక్టోబర్ 01 :తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్య టనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళికలతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరు గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది. గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికే పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. అమిత్ షా పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారుతోంది. కాంగ్రెస్ - బీఆర్ఎస్ లక్ష్యంగా అమిత్ షా తెలంగాణలో పార్టీ నేతలకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసారు. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ... ప్రత్యేకంగా తటస్థులతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. కాగా, తెలంగాణలో పార్టీ కార్యాచరణ పైన ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోవడానికి "సడక్ సే సదన్ తక్" కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో అమిత్ షా కరీంనగర్, మెదక్ జిల్లాలలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ కాలేజ్ లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా అమిత్ షా పర్యటన సాగనుందని పార్టీ నేతలు చెబుతున్నారు. అమిత్ షా పర్యటన ద్వారా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపాలని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని వ్యూహం సిద్ధం చేస్తున్నారు. దీంతో, అమిత్ షా పర్యటన పైన రాజకీయంగా ఆసక్తి నెలకొంది.

# ఎన్నికల కమిషన్ కార్యాలయం తగలబడిపోతది

- హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు..
- ఓట్లు పునరుద్ధరించకుంటే ఊరుకొనేది లేదు
- దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 01 :సర్ లో భాగంగా ఖైరతాబాద్ లో తీసేసిన ఓట్లు తిరిగి పునరుద్దరించకుంటే ఊరుకొనేది లేదని దానం హెచ్చరించారు. హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు.. తగలబడి పోతుందంటూ వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియలో భాగంగా తన నియోజకవర్గంలో 20 వేల ఓట్లను తెలిగించారని దానం చెప్పారు. ఎస్ఐఆర్ గురించి రాహుల్ గాంధీ పదే పదే ఎందుకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని. ఇప్పుడు మా నియోజకవర్గంలో ప్రత్యేకించి 20 వేల ఓట్లు ఇప్పటివరకు కట్ చేశారని చెప్పుకొచ్చారు. వారికి నోటీసులు ఇచ్చారని.. దాన్ని సరిచేయాలని డిమాండ్ చేసారు. ఇందులో చాలా మంది బీజేపీతో అనుబంధంగా.. ఎవరైతే ఏఎంసీలున్నరో.. ఏఆర్‌వోలున్నరో బీజేపీతో కుమ్మక్కై పెద్ద ఎత్తున ఓట్లు తొలగించే ప్రక్రియ చేపడుతున్నారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్నాని... ఎవరైతే మా ఓట్లు తీయించే ప్రయత్నం జరుగుతున్నదో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఓటు చోరీ నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత తమ పై ఉందన్నారు. ఇప్పటిదాకా డిలీట్ చేసిన ఓట్లను మళ్లీ పరిగణలోకి తీసుకొని అందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేసారు. కాగా.. ఉప ఎన్నిక ప్రక్రియ ప్రారంభం వేళ దానం చేసిన ఈ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. కాగా దానం పై న్యాయస్థానం అనర్హత వేటు తో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఖాయమైంది. ఇప్పటికే ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయింది. త్వరలో ఎన్నికల సంఘం ఉప ఎన్నిక షెడ్యూల్ ప్రకటించనుంది. కాగా.. ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ మహిళా నేత విజయా రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్ సంచలనంగా మారిందది. ఇక.. ఇటు దానం నాగేందర్ సర్ ప్రక్రియలో భాగంగా ఖైరతాబాద్ లో తొలిగించిన ఓట్ల పైన దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

ఖైరతాబాద్ ఉప ఎన్నిక చుట్టూ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయం నడుస్తోంది. ఇప్పటికే ఉప ఎన్నిక ఖాయం కావటంతో కాంగ్రెస్ నుంచి తిరిగి దానం నాగేందర్ పోటీ చేస్తారని చెబుతున్నారు. అదే విధంగా బీజేపీ, బీఆర్ఎస్ నుంచి అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. ఇటు ఎన్నికల సంఘం త్వరలోనే ఈ ఉప ఎన్నిక కోసం షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా.. ఈ ఎన్నిక పైన అభ్యర్థిత్వం పైన కాంగ్రెస్ నుంచి విజయారెడ్డి– దానం మధ్య పోటీ నెలకొంది. విజయా రెడ్డి తాజాగా ఈ ఉప ఎన్నిక పైన హైకోర్టను ఆశ్రయించారు. కాగా.. ఇటు దానం చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికకు తాత్కాలిక బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకూడదని ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుని కోరారు. ఈలోపు ఎన్నికల సంఘమే స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పిటిషన్ పై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నిక నోటిపికేషన్ జారీ చేయమని హైకోర్టుకు ఈసీ తెలిపింది. కాగా.. ప్రస్తుతం తెలంగాణలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ అనర్హతకు గురైన నేపథ్యంలో ఆ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయింది. ఈ క్రమంలో ఖైరతాబాద్ ఎలక్షన్ షెడ్యూల్ ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయకుండా ఎన్నికల కమిషన్? కు ఆదేశాలు జారీ చేయాలంటూ దివంగత నేత పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై ఇంకా హైకోర్టు తుది తీర్పు వెల్లడించకముందే భారత ఎన్నికల సంఘం తెలంగాణ హైకోర్టుకు కీలక విషయాన్ని తెలిపింది. విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ పై తుది పరిష్కారం వచ్చేంత వరకూ ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి బై పోల్ నోటిఫికేషన్ జారీ చేయబోమని ఈసీఐ స్పష్టం చేసింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక నిర్వహణ ప్రక్రియపై విచారణ తేలేంత వరకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు అయింది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో దానం నాగేందర్ ఎన్నికల కమిషన్? కు సమర్పించిన అఫిడవిట్? లో తప్పుడు సమాచారం ఇచ్చారని.. ఈ మేరకు ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలంటూ 2024 జనవరిలోనే విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్ సింగిల్ బెంచ్? జడ్జి వద్ద పెండింగ్? లో ఉందని విజయారెడ్డి తరపు న్యాయవాది సీజే ధర్మాసనం దృష్టికి తాజాగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో దానిపై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకూడదని ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టుని కోరారు. ఈలోపు ఎన్నికల సంఘమే స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ పిటిషన్ పై తుది తీర్పు వచ్చేదాకా ఖైరతాబాద్ ఉప ఎన్నిక నోటిపికేషన్ జారీ చేయమని హైకోర్టుకు ఈసీ తెలిపింది. ఇక దానం నాగేందర్ అనర్హతకు గురికావడంతో ప్రస్తుతం ఖైరతాబాద్ స్థానం ఖాళీగానే ఉంది. ఇదిలాఉంటే దిల్లీలోని తెలంగాణ భవన్ ఎదుట దానం నాగేందర్ కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిందని ఆయన ఖైరతాబాద్ నుంచి పోటీ చేస్తే మరోసారి ఓడిపోవడం తథ్యమంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఖైరతాబాద్ టికెట్ సీఏ వేణుగోపాల్ స్వామికి ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# (మొదటిపేజీ తరువాయి)

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?



శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.మరోవైపు రేవంత్ రెడ్డికి ఒక గొప్ప చరిత్ర ఉంది.. ఆయన ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్ అయితదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు.. తెలంగాణలో తెలుగు దేశంను మొత్తం ఆ పార్టీనే లేకుండా చేసి అడుగు నాశనం చేసి పోయిండు. అక్కడికెల్లి ఇయ్యాళ్ల కాంగ్రెస్‌లకు వచ్చిండు. దీన్ని కూడా కచ్చితంగా మళ్లీ ఒక 25-30 ఏండ్లు ఎవడూ ఓటేయకుండా చేసే పోతడు. కాంగ్రెస్ మరిపించి.. మొత్తం నాశనం చేసే పోతడన్నారు కేటీఆర్ . నేతన్నకు బీమా అనే పథకం పెట్టినం. ఎవరన్నా నేత కార్మికుడు చనిపోతే రూ.6 లక్షలు రైతు బీమాలాగే పెట్టినం. మేమంతా కలిసి చేసినం. దాని గురించి ఏమైనా చెప్తడేమో చూసినం. ఆగిపోయింది మళ్లీ షురూ చేస్తా అని చెప్తడేమో అనుకున్నం.. దాని గురించి మాట లేదని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరలు బంద్ అయినయ్. అవి మళ్లీ అక్కడ పెడ్తడేమో చెప్తడేమో అనుకున్నం. దాని గురించి ముచ్చట లేదు. అక్కడ నీళ్లిచ్చే పథకం బంద్ అయింది.. దాని గురించి ఏమైనా చెప్తడేమో అనుకున్నం. ఏం లేదు.. మళ్లీ గదే పుక్కిటి పురాణం. ఇక్కడ చేసిన కథలే అక్కడ కూడా చేయడం. ఈ పాటి అందానికి అక్కడికి పోయి మీటింగ్ పెట్టాల్నా అని చురకలంటించారు. అదేదో ఇక్కడనే మైక్ ముందు ఒర్లితే అయిపోతుండేనన్నారు. రేవంత్ రెడ్డి అక్కడికిపోయి ఏదో దండయాత్రకు పోయినట్టు.. ఒక ముఖ్యమంత్రి, ఒక పీసీసీ ప్రెసిడెంట్, ఆరుగురు మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు.. ఏదో శత్రు దేశం మీద దండయాత్రకు పోయినట్టు పోయారు.. మళ్లీ పేరేమో నల్లమల పులి.. ఎక్కడన్నా నల్లమల పులి 4000 పోలీసులను పెట్టుకోని పోతడా.. అంతమందిని కాపాలా పెట్టుకోని పోయిటోడివి.. నువ్వు పులివా.. నువ్వు నల్లమల పులివి కాదు.. చంద్రబాబు దగ్గర పిల్లి నువ్వు.. అని చురకలంటించారు. రేవంత్ రెడ్డి మొత్తుకునుడు అంతా.. నేను 2009లో రాసిన అఫిడవిట్‌లో నేను రాసిన దాని గురించే నీకు హోటల్ ఉన్నదని చెబుతున్నడు. నేనే చెప్పిన కదా ఉన్నదని.. నువ్వు చెప్పుడేందన్నారు కేటీఆర్. రేవంత్ రెడ్డి పెద్ద కొలంబస్ లెక్క.. వాస్కోడిగామా కదా ఏదో కనుక్కున్నట్టు నువ్వేం కనిపెడితివి కొత్తగా.. అఫిడ విట్‌లో ఉన్నదే నువ్వు చెప్తున్నవ్.. మరి వ్యాపారం చేసుకునుడు తప్పా.. నా భార్య పిల్లలకు కూడా నేను బువ్వ పెట్టాలి కదా.. లేకపోతే వాళ్లు నువ్వు రాజకీయంలా ఏం చేస్తున్నవ్ అని అడుగుతరు.. వాళ్లకు బువ్వ పెట్టనీకి నేను వ్యాపారం బరాబర్ చేస్తా తప్పేందన్నారు కేటీఆర్. నిజంగా నేను వ్యాపారాన్ని పట్టించుకుంటే నేను ఈ రాజకీయం విడిచిపెట్టి ఓ 10 హోటళ్లు చేస్తుండే ఇప్పటికి.. ఇప్పుడు మూడే హోట ళ్లున్నాయి. దానికి ఈయన ఫ్రీ పబ్లిసిటీ ఇచ్చిండు.. చాలా సంతోషం రేవంత్ రెడ్డి నా హోటళ్లకు పబ్లిసిటీ ఇచ్చినందుకు.. నీకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా అని కేటీఆర్ పేర్కొన్నారు.

## వ్యాపార సంస్థలపై తీవ్రమైన సైబర్ ప్రభావం

అయితే భద్రత బలహీనపడటానికి కారణాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. సంస్థలలో సరైన సమన్వయం లేకపోవడం, డేటా సంక్లిష్టత, అనుమతుల్లో జరిగే జాప్యం సైబర్ భద్రతను మరింత బలహీనపరుస్తున్నాయని వెల్లడైంది. సిస్కో రూపొందించిన ఈ నివేదిక కోసం ప్రపంచవ్యాప్తంగా 30 మార్కెట్లకు చెందిన 8,000 మంది సెక్యూరిటీ నిపుణులను సర్వే చేశారు. ఇందులో భారత్‌కు చెందిన 1,000 మంది నిపుణులు కూడా ఉన్నారు. సంస్థలు తమ డిజిటల్ వ్యవస్థలను ఎంత సమర్థంగా రక్షించుకుంటున్నాయి, సైబర్ ముప్పులను ఎంత వేగంగా గుర్తించి పరిష్కరిస్తున్నాయి.. అలాగే సైబర్ సెక్యూరిటీకి అడ్డంకులుగా మారుతున్న అంశాలు ఏంటనే విషయాలను అధ్యయనం చేశారు. సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయడంలో కేవలం టెక్నాలజీ లోపాలే ప్రధాన సమస్య కాదని నివేదిక వెల్లడించింది. సంస్థల్లో ఆమోద ప్రక్రియల్లో జాప్యం, విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం, డేటా వేర్వేరు చోట్ల ఉండటం వంటి అంతర్గత సమస్యలు కూడా సైబర్ రక్షణను బలహీనపరుస్తున్నాయని పేర్కొంది. భారత్‌లో కేవలం 40 శాతం మంది ప్రతినిధులు మాత్రమే సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్, ఐటీ విభాగాలు ఒకే బృందంలా సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

## ఫారం- 6లో మార్పులకు ఎవరు ఆదేశించారు?

ఆమోదించారంటూ ప్రశ్నించారు. అలాగే టీసీఎస్ లో ఈ మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఆన్‌లైన్ 'ఫారం 6' చట్టవిరుద్ధంగా మార్చారని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిని స్వయంగా ఎన్నికల సంఘంలో కమిషనర్లే అభ్యంతరంగా నమోదు చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఆ మార్పులు చేయమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ను ఎన్నికల సంఘంలో ఎవరు ఆదేశించారని ఆయన ప్రశ్నించారు. టీసీఎస్ లో ఎవరు దీనికి ఆమోదం తెలిపారని కూడా అడిగారు. అలాగే, అలా చేయడానికి వారిపై ఒత్తిడి తీసుకువచ్చారా అని కూడా రాహుల్ గాంధీ వరుసగా ప్రశ్నలు సంధించారు. దీంతో టీసీఎస్ కూడా ఈ వ్యవహారంలో జవాబు చెప్పాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ముఖ్యంగా ఈసీ నుంచి తమకు వచ్చిన ఆదేశాలు, వాటి అమలుకు సంస్థలో ఎవరు ఆమోదం తెలిపారన్న అంశాల్ని ఇప్పుడు టీసీఎస్ బయటపెడుతుందా లేక ఈసీపైనే నెపం వేసి తప్పించుకుంటుందా అన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఈ సర్ ప్రక్రియను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురూ కలిసి సర్ ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని, ఇది దేశద్రోహం కిందికే వస్తుందని ఆరోపించారు. ఇదే సమయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని, మోదీ- షా ద్వయంపై దర్యాప్తు జరగాలని కూడా ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కర్ణాటక బెళగావిలో ఓటర్ల పేర్ల తొలగింపు కుట్రకు సంబంధించి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో కేవలం 3 రోజుల్లోనే బెళగావిలో సుమారు 15 వేల మంది ఓటర్ల పేర్లను తొలగించడానికి ప్రయత్నం జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనికి సంబంధించి వేలాది ఫారం- 7 దరఖాస్తులు వెల్లువెత్తాయని, ఎక్కువగా బీజేపీని వ్యతిరేకించే ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని గతంలో చేసిన ఆరోపణల్ని రాహుల్ మరోసారి ప్రస్తావించారు. కర్ణాటక కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నారని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సర్ ప్రక్రియపై బుధవారం రోజు ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన 19 రాజకీయ పార్టీల నేతలు సుదీర్ఘంగా సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 2-8 మధ్య జిల్లాల స్థాయిలో సేవ్ డెమోక్రసీ మార్చ్‌లు నిర్వహించాలని నిర్ణయించింది. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలంతా కలిసి కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఓటర్ల జాబితా సవరణపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి తమ అభ్యంతరాలను తెలియజేయాలని కూటమి నిర్ణయించింది. రాబోయే ఎన్నికలన్నింటినీ ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలనే డిమాండ్‌ను మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. సర్ ప్రక్రియకు సంబంధించి సుప్రీం కోర్టులో ఉన్న కేసుల్ని వేగవంతం చేయాలని కూడా ఈ సందర్భంగా కోరుతోంది.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే..

డిమాండ్ చేస్తూ కాక్రోచ్ లు ముంబైలో నిరసనకు సిద్ధమయ్యారు. రేనేడు సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ కార్యక్రమం చేపట్టబోతున్నారు. సీఈసీని వెంటనే తప్పించి, అరెస్టు చేయాలని కాక్రోచ్ లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో మహా సర్కార్ ఈ నిరసనను అడ్డుకునేందుకు సిద్ధమవుతోంది. మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, 3 డిమాండ్లను ముందుకు తెస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దిప్కే వెల్లడించారు. ఇందులో మొదటిది జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి, క్రిమినల్ విచారణను ఎదుర్కోవాలి, ఆదేశాలు ఎవరు ఇచ్చారో వెల్లడించాలి. అలాగే రెండవది ఎస్ఐఆర్ ను నిలిపివేయాలి, జనవరి 2025 ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలి, స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. మూడో డిమాండ్ 2023 ఎన్నికల కమిషనర్ల నియామకాల చట్టాన్ని రద్దు చేసి, పౌర సమాజ భాగస్వామ్యంతో పారదర్శక చట్టాన్ని తీసుకురావాలి. వారు తమకు నచ్చిన వారిని కేవలం నిర్ణయించి ఎన్నికల కమిషనర్‌గా నియమించలేరని కేంద్రాన్ని ఉద్దేశించి అభిజీత్ దిప్కే పేర్కొన్నారు. ఈ పదవిలో ఎవరు ఉంటారనే దానిపై 150 కోట్ల మంది జీవితాలు ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయన్నారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా ఉండాలని దిప్కే కోరారు. ఎస్ఐఆర్ కు ముందే, ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎస్ఐఆర్ జాబితా ప్రకారం ఎన్నికలు జరిగితే, ప్రధాని మోదీ అమెరికాలో కూడా గెలవగలరని దిప్కే ఎద్దేవా చేశారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థులపై బీఆర్ఎస్ కసరత్తు!?



హైదరాబాద్, అక్టోబర్ 01 :రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. పార్టీలన్నీ ఈ ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ స్థానాలకు జరగబోయే ఎన్నికలను సెమీ ఫైనల్స్ గా భావిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే తన అభ్యర్థులను ప్రకటించింది. బీఆర్ఎస్ కూడా అభ్యర్థుల ఖరారు పైన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ ముఖ్య నేతల సమావేశంలో కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. బీఆర్ఎస్ ఈ ఎన్నిక ల్లో అభ్యర్థుల ఖరారు పైన కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. కేసీఆర్ పార్టీ ముఖ్యులతో మంత్రాంగం సాగిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ వాణీదేవి ఈ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుంటూ అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానానికి 'రెడ్డి' సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని, అలాగే హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ స్థానానికి 'బీసీ' అభ్యర్థిని బరిలో దింపాలని గులాబీ నాయకత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం. వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేసే బాధ్యతను అనుగుల రాకేష్ రెడ్డికి అప్పగించింది. ఇప్పటి కే క్షేత్ర స్థాయిలో ఎన్నికల కార్యాచరణ ప్రారంభించారు. కాగా.. రాకేష్ రెడ్డి గతంలో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఆయన గట్టిగా ఫైట్ చేస్తున్నారు. అదే విధంగా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ స్థానం కోసం బీసీ అభ్యర్థిని పరిశీలిస్తోంది. కాసాని వీరేశ్ ముదిరాజ్, జి. నాగేందర్ గౌడ్, రవీందర్ యాదవ్ తదితరుల పేర్ రేసులో ఉన్నాయి. ఆయన ఇప్పటికే పలు ప్రాంతాల్లో పట్ట భద్రుల నమోదు కార్యక్రమాలను ముమ్మరం చేశారు. వికారాబాద్ కు చెందిన మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ జి. నాగేందర్ గౌడ్ పేరును కూడా పార్టీ పరిశీలిస్తోంది. కాంగ్రెస్ కు చెక్ పెట్టే విధంగా బీఆర్ఎస్ అభ్యర్థుల పై కసరత్తు చేస్తోంది. అందుకే ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల కు ముందు జరిగే ఈ గ్రాడ్యుయేట్ ఎన్నికలను సెమీస్ గా భావిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులను అధికారికంగా ప్రకటించనున్నారు.

## 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు

- కెప్టెన్ స్మిత్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 01 : ఫ్లైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకున్న భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. తీవ్రంగా గాయపడినా సమయ స్ఫూర్తి, ధైర్యంతో వ్యవహరించి 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నారని కొనియాడారు. గురువారం ఢిల్లీలో జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శతాబ్ది వేడుకల్లో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "కెప్టెన్ స్మిత్ అసాధారణమైన సహనం, సమయ స్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లు.. ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నాడు" అని మోదీ పేర్కొన్నారు. అంతకుముందు కూడా స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన ప్రధాని.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బుధవారం బయలుదేరిన ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్ 1073 విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి కో-పైలట్ విమానాన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో విమానం ఒక్కసారిగా భారీగా కిందకు దిగొచ్చింది. దాదాపు 17,000 అడుగుల ఎత్తు ఒక్క నిమిషంలోనే కోల్పోయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వివరాలు వెల్లడించాయి. తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లగలిగారు. అనంతరం దాడికి పాల్పడిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో 174 మంది ఉన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విషాదానికి దారితీసే ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. స్మిత్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత అధికారులు తెలిపారు.

## ఎర్రవల్లి భూ సర్వే నివేదిక సిద్ధం

- 325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల పరిశీలన
- 244 మంది అనుభవదారులకు నోటీసులు
- ప్రభుత్వానికి అందజేయనున్న అధికారులు



హైదరాబాద్, అక్టోబర్ 01 : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి భూముల సర్వే నివేదిక సిద్ధమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు చేపట్టిన సర్వేకు సంబంధించిన పూర్తి నివేదికను అధికారులు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి అందజేశారు. ఈ నివేదికను కలెక్టర్ నేడు ప్రభుత్వానికి సమర్పించనున్నారు. నివేదికలో ఏ అంశాలను పొందుపరిచారు? భూములపై ఎలాంటి వివరాలు వెల్లడవుతాయి? అన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాలు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో అధికారులు సర్వే నిర్వహించారు. ఎర్రవల్లిలో 244 మంది అనుభవదారులకు,వెలికట్టలో 118 మందికి నోటీసులు ఇచ్చారు. అనంతరం ఆయా భూముల్లో క్షేత్రస్థాయిలో హద్దులు, కబ్జాపై ఉన్నవారి వివరాలను పరిశీలించారు. ఎర్రవల్లిలో ఎనిమిది రోజుల పాటు, వెలికట్టలో ఐదు రోజుల పాటు సర్వే కొనసాగింది. ఈ భూముల విషయంలో శివారు వెంకటాపూర్ గ్రామస్థులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని వారు చెబుతున్నారు. ఇటీవల వెంకటాపూర్ రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. పాత రికార్డుల ఆధారంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు సర్వే నంబర్ 325లో భూములు సాగు చేసుకుంటున్న రైతుల్లోనూ ఆందోళన ఉంది. దశాబ్దాలుగా తమ అధీనంలో ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వారు ఎదురుచూస్తున్నారు. సర్వే సందర్భంగా రైతులు తమ వద్ద ఉన్న పట్టా పాస్‌బుక్కులు, ఇతర పత్రాలను అధికారులకు చూపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మర్కూక్ మండల పరిధిలోని భూములపై లెక్కలు తేల్చాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ సర్వే చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పుడు కలెక్టర్ సమర్పించనున్న నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలకంగా మారింది.

## యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ పొడిగింపు లేదు



### 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చాం
### సర్‌లో ఈసీ కొన్ని మార్పులు చేసింది
### ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 01 : తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు. సర్ ప్రక్రియను మరోసారి పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

## దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు




### శివుడు, శ్రీరాముడిని వేరు చేసి వ్యాఖ్యలా?
### ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు
### సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

హైదరాబాద్, అక్టోబర్ 01 :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# జయహో స్మిత్ మచ్చార్!

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఊహించని ప్రమాదం తప్పింది. గాల్లో ఉండగానే కో-పైలట్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన భారత సంతతి కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. రక్తమోడుతున్నప్పటికీ కాక్‌పిట్ తలుపు తెరిచి, పెను విమాన ప్రమాదాన్ని నివారించి 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. బోయింగ్ 737 మ్యాక్స్-8 విమానం గాల్లో ఉండగా, ఒమన్ జాతీయుడిగా భావిస్తున్న కో పైలట్ అకస్మాత్తుగా కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై కత్తితో దాడి చేశాడు. విమాన నియంత్రణ వ్యవస్థలను ధ్వంసం చేసి, విమానాన్ని కూల్చేందుకు అతను తీవ్రంగా ప్రయత్నించాడు. ఆ పెనుగులాటలో విమానం కేవలం 30 సెకన్లలోనే దాదాపు 14,000 అడుగుల కిందికి దూసుకువచ్చింది. తీవ్ర గాయాలపాలై కిందపడిపోతున్న సమయంలో కూడా కెప్టెన్ స్మిత్ చాకచక్యంగా కాక్‌పిట్ డోర్‌ను అన్‌లాక్ చేసి కేకలు వేశారు. విమానం తీవ్ర కుదుపులకు లోనవడం, అరుపులు వినిపించడంతో అప్రమత్తమైన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. కాక్‌పిట్‌లోకి చొరబడిన ప్రయాణికులలో యానివ్ అనే ఇజ్రాయెల్ ప్లంబర్ ప్రధాన పాత్ర పోషించారు. టీవీలో ప్రసారమయ్యే ఎయిర్ డిజాస్టర్స్ కార్యక్రమాలు చూసి విమానాల నియంత్రణపై ప్రాథమిక అవగాహన పెంచుకున్నట్లు చెప్పిన యానివ్, ఇతర ప్రయాణికులతో కలిసి విధ్వంసానికి పాల్పడుతున్న కో-పైలట్‌ను కుర్చీ నుంచి వెనక్కి లాగి బంధించారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు పైలట్లు, భద్రతా సిబ్బంది వెంటనే కాక్‌పిట్ నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుని విమానాన్ని అదుపు చేశారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. దాదాపు 8 గంటల నిరీక్షణ అనంతరం ప్రయాణికులను మరో ప్రత్యామ్నాయ విమానంలో టెల్ అవీవ్‌కు తరలించారు. గుజరాత్‌కు చెందిన స్మిత్ మచ్చార్ కమర్షియల్ ఏవియేషన్ రంగంలో పదేళ్లకు పైగా విశేష అనుభవం కలిగిన పైలట్. జూన్ 2011 నుండి 2022 వరకు దాదాపు 11 ఏళ్లపాటు భారత విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2022లో డైరెక్ట్ ఎంట్రీ కెప్టెన్‌గా ఫ్లైదుబాయ్‌లో చేరారు. బోయింగ్ 737 విమానాల నిర్వహణ, భద్రతా

## సంపాదకీయం

ప్రమాణాల్లో ఆయన నిపుణుడు. వెలింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పొందారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, ఆయన కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది. మచ్ఛర్‌కు కమర్షియల్ విమానయానంలో 13 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఫ్లైదుబాయ్‌లో చేరకముందు ఆయన 11 ఏళ్లకు పైగా స్పైస్‌జెట్‌లో పనిచేశారు. జూన్ 2011 నుంచి జూన్ 2022 వరకు స్పైస్‌జెట్‌లో విధులు నిర్వహించిన ఆయన సీనియర్ కమాండర్‌గా, లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 2020 నుంచి జూన్ 2022 వరకు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా ఇతర పైలట్లకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. బోయింగ్ 737 విమానాలను 9,500 గంటలకు పైగా నడిపిన అనుభవం మచ్ఛర్‌కు ఉంది. జూన్ 2022 నుంచి ఫ్లైదుబాయ్‌లో కెప్టెన్‌గా పనిచేస్తూ దుబాయ్‌లో నివసిస్తున్నారు. అక్కడ కూడా పైలట్ల శిక్షణ, విమాన కార్యకలాపాల నిర్వహణలో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విమానయాన భద్రతా ప్రమాణాలు, నిబంధనల అమలు, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే అనుభవం ఆయన కెరీర్‌లో భాగంగా ఉంది. ప్రస్తుతం సెప్టెంబర్ 30న జరిగిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన అద్భుత ధైర్యాన్ని ప్రపంచ నేతలు కొనియాడారు. ఓవల్ ఆఫీస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. "స్మిత్ చాలా తీవ్రమైన గాయాలపాలైనా సమయస్ఫూర్తితో వ్యవహరించి రియల్ హీరోగా నిలిచారు. ఇదొక అద్భుతమైన సంఘటన" అని అన్నారు. తీవ్రంగా గాయపడినా వెనకడుగు వేయకుండా ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ అసాధారణ ధైర్యానికి నా సెల్యూట్. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. స్మిత్‌ను అత్యంత నైపుణ్యం కలిగిన వీరుడిగా అభివర్ణిస్తూ, భారత్-ఇజ్రాయెల్-యూఏఈ తరఫున ఆయన క్షేమం కోసం ప్రార్థిస్తున్నట్లు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి తెలిపారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. గురువారం ఉదయం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్న ప్రధాని.. కెప్టెన్ స్మిత్ మచార్‌ను హీరోగా అభివర్ణించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తీవ్రంగా గాయపడినా, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, అచంచలమైన సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, పెద్ద విషాదాన్ని నివారించిందని అన్నారు. కెప్టెన్ మచార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. మరోవైపు కాక్‌పిట్‌లో గొడవ జరుగుతున్న విషయం గుర్తించిన యానివ్.. వెంటనే అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మరో ప్రయాణికుడితో కలిసి కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు. చివరకు లోపలికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు సహకరించారు. ఈ ఘటనలో యానివ్ షర్టుపై రక్తపు మరకలు కనిపించాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విమానం సురక్షితంగా ఇజ్రాయెల్‌కు చేరుకున్న తర్వాత యానివ్ హయూన్ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును కలిశారు. ఈ సందర్భంగా నెతన్యాహు అతన్ని అభినందించారు. 'చాలా గొప్ప పని చేశావు. నువ్వు హీరో' అంటూ ప్రశంసించారు. ఆ తర్వాత విమానంలో జరిగిన పరిణామాలను యానివ్ ప్రధానితో పంచుకున్నారు. విమానంలో లైట్లు ఆగిపోవడం, క్యాబిన్ పరిస్థితుల్లో మార్పులు రావడం నుంచి కాక్‌పిట్‌లోకి వెళ్లే వరకు ఏం జరిగిందో వివరించారు. విమానం ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా లైట్లు ఆఫ్ అయ్యాయని ప్లంబర్ గా పనిచేస్తున్న హయూన్ తెలిపారు. అదే సమయంలో క్యాబిన్‌లోని గాలి పీడనంలో మార్పును గుర్తించడంతో విమానంలో ఏదో సమస్య తలెత్తిందని భావించి కాక్‌పిట్ వైపు వెళ్లాననీ చెప్పారు. తనతో పాటు మరో ప్రయాణికుడు కూడా అక్కడికి వచ్చాడని, అతను ఆ సమయంలో డ్యూటీ లేని ఓ పైలట్ అని తర్వాత తెలిసిందని హయూన్ చెప్పారు. కాక్‌పిట్ లోపల ఏదో ఘర్షణ జరుగుతున్నట్లు గుర్తించిన హయూన్, మరో ప్రయాణికుడు తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే కెప్టెన్ స్మిత్ మచ్చర్ గాయపడి స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్నారు. అయినప్పటికీ కెప్టెన్ మచ్చర్ కాక్‌పిట్ తలుపును అన్‌లాక్ చేశారు. తలుపు తెరుచుకున్న వెంటనే తామిద్దరూ లోపలికి వెళ్లినట్లు వివరించారు. లోపలికి వెళ్లినప్పుడు ఒక పైలట్ నేలపై పడి ఉండగా.. మరో వ్యక్తి విమానం కంట్రోల్స్ దగ్గర ఉన్నట్లు హయూన్ తెలిపారు. అతడే దాడికి పాల్పడిన వ్యక్తిగా భావించి వెంటనే అతడిని కంట్రోల్స్ నుంచి దూరంగా తీసుకెళ్లారు. విమానం ఎత్తు కూడా తగ్గుతున్నట్లు ఆ సమయంలో తనకు అనిపించిందని వివరించారు. విమానం అదుపు తప్పే పరిస్థితి కనిపించడంతో హయూన్ వెంటనే కంట్రోల్ స్టిక్స్‌ను పట్టుకున్నారు. 'కంట్రోల్ స్టిక్స్‌ను నా చేతులతో పట్టుకుని వెనక్కి లాగాను. ఆ తర్వాత విమానం మళ్లీ సాధారణ ఎత్తుకు చేరుకుంటున్నట్లు అనిపించింది' అన్నారు. విమానం ఎలా అదుపులోకి తీసుకురావాలో తనకు ప్రత్యేక శిక్షణ లేకపోయినా.. గతంలో చూసిన టీవీ కార్యక్రమంలో విమాన ప్రమాదాల సమయంలో పైలట్లు ఎలా స్పందిస్తారో చూసిన విషయాలు గుర్తొచ్చాయని హయూన్ తెలిపారు. కాక్‌పిట్‌లో జరిగిన ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విమానంలో అసలు ఏం జరిగింది? ఈ ఘటనకు కారణమేంటి? అనే విషయాలపై పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఏది ఏమైనా కెప్టెన్ స్మిత్ మచ్చర్ చేసిన సాహసాన్ని యావత్ ప్రపంచం కొనియాడుతుంది. నిజంగా కెప్టెన్ స్మిత్ మచ్చర్ కు హాట్సాఫ్ చెప్పాల్సిందే.

# రెండు డీఏలు మంజూరు

- ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త
- ఏడాదికి రెండున్నర వేలకోట్ల అదనపు భారం
- ఒక డీఏ రాబోయే జీతాలతో కలిపి పంపిణీ
- తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఎల్‌నినో పరిస్థితులపై భేటీలో సుదీర్ఘ చర్చ
- కరవు పరిస్థితులపై చర్యలకు సమాలోచనలు
- ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లపై పలు సూచనలు
- ప్రాజెక్టులపై పునస్సమీక్షించాలని నిర్ణయం
- 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టుల నిలిపివేత
- డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు న్యూ పాలసీ

**హైదరాబాద్, అక్టోబర్ 01 :** తెలంగాణలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులతో ఇటీవల జరిపిన చర్చల అనంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు.. రాష్ట్రంలో ఉద్యోగులకు, పింఛనుదారులకు నిలిచిపోయిన పెండింగ్ కరువు భత్యాల్లో రెండు విడతల డీఏల విడుదలకు కేబినెట్ అధికారిక ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు , రిటైర్డ్ పెన్షనర్లకు వేతనాల పరంగా పెద్ద ఊరట లభించనుంది.కేబినెట్ నిర్ణయాల ప్రకారం.. ఉద్యోగులకు 3.64 శాతం , 2.74 శాతం చొప్పున మొత్తం రెండు డీఏలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఒక డీఏను త్వరలోనే రాబోయే జీతాలతో కలిపి పంపిణీ చేయనుండగా, మరో డీఏను రాబోయే పండుగలు, తదుపరి షెడ్యూల్ ప్రకారం విడుదల చేయనున్నారు. అంతేకాకుండా, ఉద్యోగులు , పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ. 10,000 కోట్ల పాత జీపీఎఫ్, గ్రాట్యుటీ, మెడికల్ బిల్లుల బకాయిలను ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తూ రాబోయే కాలంలో పూర్తిగా చెల్లించేలా బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన కార్యాచరణకు అంగీకారం తెలిపింది. డీఏల విడుదలతో పాటు పే రివిజన్ కమిషన్ నివేదిక అమలుపై కూడా కేబినెట్ భేటీలో విస్తృతంగా చర్చించారు. పీఆర్సీ కమిటీ అందించే తుది నివేదికను పరిశీలించి, వీలైనంత త్వరగా కొత్త వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాల విన్నపాలను సానుకూలంగా పరిశీలించి ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం వెల్లడించింది. కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల అంశాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ధరణి పోర్టల్ స్థానంలో తీసుకురానున్న కొత్త భూపరిపాలన వ్యవస్థ, నిషేధిత భూముల జాబితా సమీక్ష , రైతులకు సంబంధించిన పలు సంక్షేమ పథకాల అమలుపై సభలో చర్చ జరిగింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ నిధుల మంజూరుకు మంత్రివర్గం అమోదముద్ర వేసింది. గురువారం నాటి కేబినెట్ సమావేశం బహుళ ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలతో ముగిసింది. దసరా, దీపావళి పండుగల వేళ విడుదలైన రెండు డీఏల నిర్ణయం ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ నిర్ణయానికి సంబంధించిన పూర్తి వివరాలు, చెల్లింపుల షెడ్యూల్ , అర్హతలతో కూడిన అధికారిక జీవోలు ఆర్థిక శాఖ ద్వారా త్వరలోనే వెలువడనున్నాయి. ఎల్ నినోను ఎదుర్కోవడంపై కేబినెట్ లో చర్చించారు. సబ్ కమిటీని నియమించనున్నారు. కేంద్రాన్ని సాయం అడగాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున కరవు మండలాలను ప్రకటించి తగిన సాయం అందించాలని కేంద్రాన్ని తెలంగాణ కేబినెట్ కోరింది. త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు దిల్లీకి మంత్రుల బృందం వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సుమారు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలను రాష్ట్ర మంత్రివర్గం మంజూరు చేసింది. తెలంగాణ డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ పాలసీని మంత్రివర్గం ఆమోదించింది. వివిధ కేటగిరీల్లోని భూముల క్రమబద్ధీకరణ కోసం కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఎల్?నినో పరిస్థితులపై కేబినెట్?లో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించారు. అఖిల పక్షంతో పాటు రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేసి ఉపశమన చర్యలపై సలహాలు సూచనలు స్వీకరించాలని సీఎం తెలిపారు. కరువు మండలాలు ప్రకటించడంతో పాటు.. రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి క్యాబినెట్ విజ్ఞప్తి చేసింది.ఎల్‌నినో పరిస్థితులతో గణనీయంగా పెరిగిన విద్యుత్తు వినియోగంపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు 15వేల మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 19 వేల 892 మెగావాట్ల డిమాండ్ కు చేరింది.ఈ నేపథ్యంలో డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్కడా కోతల్లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, అవసరమైన మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7 వేల 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు ఆమోదం తెలిపింది. ఈ సీజన్‌లో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు, సిబ్బంది, మౌలిక వసతులను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్‌నినో పరిస్థితులు, ఉష్ణోగ్రతల ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినట్లు కేబినెట్‌లో చర్చించారు. తెలంగాణలో సాధారణంగా రోజువారీ విద్యుత్ వినియోగం సుమారు 15 వేల మెగావాట్ల వరకు ఉండగా.. ఈ సీజన్‌లో పీక్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరింది. గత ఏడాది గరిష్ఠ డిమాండ్ 16,613 మెగావాట్లుగా ఉంది.పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కేబినెట్ నిర్ణయించింది. అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 7,800 మెగావాట్ల కొత్త విద్యుత్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, 800 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పోటీ బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించారు. భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్నారు.కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత పండ్ల మార్కెట్ నిర్మించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సుమారు 240 ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునఃసమీక్షించాలని కేబినెట్ నిర్ణయించింది. గతంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా అసంపూర్తిగా ఉన్న 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువే




- ప్రకటించిన భారత వాతావరణ కేంద్రం

**హైదరాబాద్, అక్టోబర్ 01 :** వర్షాకాలం ముగిసి నేటితో శీతాకాలం ప్రారంభమైంది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని భారత వాతావరణ కేంద్రం ప్రకటించింది. అక్టోబర్ నెలలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ విడుదల చేసిన శీతాకాలం ఔట్‌లుక్‌లో పేర్కొంది. దేశవ్యాప్తంగా అక్టోబర్ నెలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 18 శాతం లోటు వర్షపాతం నెలకొన్నట్లు వెల్లడించింది. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 19 జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొన్నట్లు తెలిపింది. అత్యధిక లోటు వర్షపాతం ఉన్న జిల్లాలుగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్‌గిరి నమోదయ్యాయి. కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో సాధారణం కన్నా అత్యధిక వర్షపాతం నమోదైంది. తెలంగాణపై ప్రభావం చూపేలా ఏడు అల్పపీడనాలు ఏర్పడగా అందులో ఆరు వాయుగుండాలు, మూడు తీవ్ర వాయుగుండాలుగా మారి ఈ వర్షపాతానికి కారణమయ్యాయి. జూన్ మాసంలో అల్పపీడనాలు ఏర్పడకపోవడంతో లోటు వర్షపాతానికి దారి తీసినట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈసారి భారత్?లోకి నైరుతి ఆగమనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. తెలంగాణలోకి సరైన సమయంలోనే అంటే జూన్ 8న ప్రవేశించినప్పటికీ వారం రోజుల పాటు దక్షిణ తెలంగాణ జిల్లా అయిన జోగులాంబ గద్వాల్ ప్రాంతంలోనే ఆగిపోయాయి. వారం రోజుల తరువాత మందకోడిగా ముందుకు కదిలి పదిహేను రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు ఏడు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. ఈ అల్పపీడనాలు ఆరు వాయుగుండంగా మారాయి. ఈ ఆరు వాయుగుండాల్లో మూడు తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెంది రాష్ట్రంలో ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో లోటు వర్షపాతం నెలకొనగా ఇది శీతాకాలంపైనా ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ ప్రకటించిన ఔట్‌లుక్‌లో వెల్లడించింది.అక్టోబర్ మాసంలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని తెలిపింది. దేశ వ్యాప్తంగా అక్టోబర్ మాసంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని చెప్పింది. తెలంగాణలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఏర్పడుతుందని పేర్కొంది. ఈ తీవ్ర ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# అత్యధికంగా సామాజిక పెన్షన్లను అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ

### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

**అమరావతి, అక్టోబర్ 01:** నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో పేదలు సేవలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు మంత్రి కొలుసు పార్థసారథి. ఇంటింటికి వెళ్ళి స్వయంగా లబ్ధిదారులను పలకరిస్తూ పింఛన్ల నగదును జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తో కలసి లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులతో మమేకమై వారి ఆరోగ్య పరిస్థి తులు, జీవన విధానం, స్వంత గృహం ఉందా లేదంటే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పింఛన్ల సొమ్మును జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు కొంతమేర పొదుపు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, గ్రామ సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న " పేదలు సేవలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో, జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో జరుగు చున్నాయని అన్నారు. జిల్లాలో అక్టోబరు నెలలో 2,53,360 మంది ఫించన్ల దారులకు రూ 111.69 కోట్ల రూపాయిలు, నూజివీడు నియోజక వర్గంలో 40,233 మందికి రూ 17.40 కోట్లు, ఒక్క చిన్న గ్రామం పల్లెర్లమూడి గ్రామంలో 670 మందికి రూ 28.72 లక్షలు రూపాయలుపంపిణీ చేస్తున్నామని అన్నారు. అర్హులైన పేదలకు సకాలంలో పారదర్శకంగా సామాజిక భద్రతా పింఛన్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఒకటవ తేదీ ఉదయాన్నే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి ఇంటి వద్దకే వెళ్ళి నగదును అందజేసేలా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టిందని తెలిపారు. ?పింఛన్ల పంపిణీ ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్నామని, నూరుశాతం పంపిణీ వేగవంతంగా పూర్తి చెయ్యాలని క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పింఛన్లు అందజేయడం జరుగుతుందని, ఒకవేళ మొదటి తేదీ ప్రభుత్వ సెలవు అయితే లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలు సేవలో ఎన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్లను ఉదయం 7:00 గంటలు నుండి అందించడం జరుగుతుందని, నూటికినూరుశాతం పింఛన్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

# చెక్‌పవర్ పై ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబర్ 01 :** తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో చెక్ పవర్ విషయంలో జరుగుతున్న ఘర్షణకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల విషయంలో ఎదురవుతున్న జాప్యానికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య విభేదాల కారణంగా చెక్కులపై సంతకాలు ఆలస్యం కావడం.. ఇలా జరగడం వల్ల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో పడుతున్న పరిస్థితిని నివారించేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. పంచాయతీల్లో చెక్కుల చెల్లింపులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు (డీపీఓ) ప్రభుత్వం స్పష్టమైన సూచనలు చేసింది. కొత్త ఆదేశాల ప్రకారం.. గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపులకు సంబంధించిన చెక్కులపై ఉప సర్పంచ్ సంతకం చేయాల్సి ఉంటే.. కారణం లేకుండా వాటిని పెండింగ్‌లో పెట్టకూడదని తెలిపింది. తగిన కారణం లేకుండా ఏడు రోజులకు మించి సంతకం చేయకుండా జాప్యం చేస్తే సంబంధిత జిల్లా కలెక్టర్ దానిపై విచారణ చేపట్టాల్సి ఉంటుంది. విచారణలో ఉప సర్పంచ్ ఉద్దేశపూర్వకంగానే చెక్కులపై సంతకం చేయకుండా బిల్లుల చెల్లింపులను అడ్డుకున్నట్లు తేలితే.. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేవలం వ్యక్తిగత విభేదాలు, ఇతర కారణాలతో పంచాయతీ నిధుల చెల్లింపులు నిలిచిపోకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. చెక్కులపై సంతకం విషయంలో అనవసర జాప్యం కొనసాగి.. పంచాయతీ అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇలాంటి సందర్భాల్లో ఉప సర్పంచ్‌కు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను తొలగించి.. ఆయన స్థానంలో అధికారుల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ కల్పించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ లేదా ఎంపీడీవోలో ఒకరికి ఉప సర్పంచ్ స్థానంలో జాయింట్ చెక్ పవర్ ఇచ్చే అవకాశం ఉంటుంది. తద్వారా చెక్కుల చెల్లింపులు ఆగిపోకుండా పంచాయతీ నిధుల వినియోగం కొనసాగించేందుకు వీలు కలుగుతుంది. గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సకాలంలో జరగడం కీలకం.



అయితే కొన్ని చోట్ల సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య తలెత్తుతున్న విభేదాలు చెక్కులపై సంతకాల విషయంలో సమస్యలకు దారితీస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఒకవైపు ఉప సర్పంచ్‌కు తన అభ్యంతరాలను తెలియజేసే అవకాశం ఉండేలా.. మరోవైపు కారణం లేకుండా సంతకాలు నిలిపివేసి పంచా యతీ కార్యకలాపాలను స్తంభింపజేయకుండా చర్యలు తీసుకునేలా నిబంధనలను స్పష్టం చేశారు. తాజా ఆదేశాలతో ఇకపై చెక్కులపై సంతకాల విషయంలో తలెత్తే వివాదాలను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏడు రోజులకు మించి కారణం లేకుండా చెక్కులు పెండింగ్‌లో ఉంటే విచారణ చేపట్టి.. ఉద్దేశ పూర్వక జాప్యం జరిగిందా లేదా అన్నది తేల్చా ల్సి ఉంటుంది.విచారణ తర్వాత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు.. అవసరమైన సందర్భాల్లో ప్రత్యామ్నాయ అధికారికి జాయింట్ చెక్ పవర్ అప్పగించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు.. చెక్ పవర్ విషయంలో తలెత్తుతున్న వివాదాలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

బలగం TV BALAGAM
రాజన్న సిరిసిల్ల కరీంనగర్ పెద్దపల్లి
balagamtv100@gmail.com

# విద్యుత్ కోతలపై రైతుల రాస్తారోకో

**-గంభీరావుపేటలో కాలిపోయిన మోటార్లతో నిరసన..**

**ఆందోళనలో సొమ్మసిల్లిన రైతు..**



బలగం టీవీ,గంభీరావుపేట:

విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. కామారెడ్డి–సిద్దిపేట ప్రధాన రహదారిపై కాలిపోయిన విద్యుత్ మోటార్లను రోడ్డుపై ఉంచి రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఎస్సై శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఏఈ ఆనంద్ ధర్నా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లా మాట్లాడగా ఎన్పిడిపిఎల్ ఎండి వచ్చేవరకు ఆందోళన విరమించే లేదని భీష్మించుకొని కూర్చున్నారు . ఈ సందర్భంగా అధికారులకు, రైతులకు మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళన సమయంలో ఓ రైతు సొమ్మసిల్లి పడిపోవడంతో అక్కడున్న వారు అతడిని సపర్యలు చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.సమాచారం అందుకున్న తహసీల్దార్ మారుతిరెడ్డి, విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులను విద్యుత్ కష్టాలు వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు ఎప్పుడు వస్తుందో,ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తరచూ లోవోల్టేజీ రావడంతో విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో వేలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని వాపోయారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నాయని, ఈ సమయంలో విద్యుత్ అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యపై పలుమార్లు ఏఈని సంప్రదించినా సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. రేపు.. మాపు అంటూ సమస్యను వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని, అవసరమైతే ఆమరణ నిరాదీక్షకు దిగుతామని అన్నారు. ఇక్కడ పలు గ్రామాల సర్పంచులు చంద్రశేఖర్ రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, మహేష్, పిట్ల బాబు, బిజెపి నాయకులు దేవేందర్ యాదవ్, గంట అశోక్, కోడి రమేష్, ప్రసాద్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ స్టిక్కర్ ఉన్న కారులో ఇసుక ట్రాక్టర్లను వెంబడించింది ఎవరు..?

**- పదిర గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్లను వెంబడించిన ప్రెస్ స్టిక్కర్ కారు..**

**- 27వ తేదీన జరిగిన ఘటనపై పోలీసుల విచారణకు సిద్ధం..**

**- కారు ఎవరిది..? అందులో ఉన్నది ఎవరు..? ఇసుక ట్రాక్టర్లను ఎందుకు వెంబడించారు..?**

**- విచారణ తర్వాత పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు**




బలగం టీవీ, ఎల్లారెడ్డి పేట:

ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ పరిధిలో గత నెల 27వ తేదీన ఇసుక ట్రాక్టర్లను ఓ ప్రెస్ స్టిక్కర్ ఉన్న కారులో వెంబడించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇసుక ట్రాక్టర్లను ఏ కారణంతో వెంబడించారు..? ఆ కారులో ఉన్న వ్యక్తులు ఎవరు..? అనే విషయాలపై ప్రస్తుతం ఆసక్తి నెలకొంది.

పదిర గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్న సమయంలో ప్రెస్ స్టిక్కర్ ఉన్న ఓ కారు వాటిని వెంబడించినట్లు సమాచారం. దీంతో అసలు ఆ వాహనం ఎవరిది, వాహనంలో ఉన్న వ్యక్తులకు మీడియాతో ఏమైనా సంబంధం ఉందా, లేక ప్రెస్ స్టిక్కర్‌ను అనధికారికంగా ఉపయోగించారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇసుక రవాణాకు సంబంధించి పోలీసులు, అధికారులు నిఘా కొనసాగిస్తున్న సమయంలో ప్రెస్ స్టిక్కర్ ఉన్న వాహనం ట్రాక్టర్లను వెంబడించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ట్రాక్టర్లను ఎందుకు ఫాలో అయ్యారు? వారి వద్ద ఏదైనా సమాచారం ఉందా? లేక వేరే కారణంతో వెంబడించారా? అనే అంశాలు పోలీసుల విచారణలో స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వాహనం నంబర్, సీసీ కెమెరా దృశ్యాలు, అందుబాటులో ఉన్న వీడియోలు, ప్రత్యక్ష సాక్షుల సమాచారాన్ని పరిశీలించి వాహనం ఎవరిదో గుర్తించే అవకాశం ఉంది. అలాగే వాహనంపై ఉన్న ప్రెస్ స్టిక్కర్ నిజమైనదేనా, ఏ మీడియా సంస్థకు సంబంధించినదో కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఇసుక రవాణా విషయంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత కాగా, ప్రెస్ పేరును ఉపయోగించే వ్యక్తులు కూడా తమ గుర్తింపును దుర్వినియోగం చేయకుండా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ ఘటనలో వాస్తవాలు ఏమిటో పోలీసుల విచారణ అనంతరం తేలాల్సి ఉంది. 27వ తేదీన పదిర గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. విచారణ పూర్తయితే ప్రెస్ స్టిక్కర్ ఉన్న కారు ఎవరిది, ఇసుక ట్రాక్టర్లను ఎందుకు వెంబడించారు అనే విషయాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాల్సి ఉంది...

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసినందుకు ప్రజలకు కృతజ్ఞతలు..

**- సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి..**

**- కేసిఆర్ కేటీఆర్ తమ ఆస్తులపై శ్వేత పత్రం విడుదల చేసి ప్రజలకు జవాబు చెప్పాలి..**

**- మండల సర్పంచ్ ల ఫోరం అద్యక్షులు దోమ్మాటి నరసయ్య**




బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల సభను విజయవంతం చేసినందుకు మహిళలకు యువతకు అన్ని వర్గాల ప్రజలకు ఎల్లారెడ్డిపేట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొమ్మాటి నరసయ్య మాట్లాడుతూ.. సిరిసిల్ల బహిరంగ సభలో సిరిసిల్ల దశ దిశ నిర్దేశించడానికి నాలుగు కిలోమీటర్ల పాదయాత్ర తో సభా స్థలానికి వచ్చి రాజన్న సిరిసిల్ల జిల్లా సమస్యలపై గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించారని ఎవరిని ముఖ్యమంత్రి విమర్శించలేదని నిందించలేదని ప్రశ్నించాడని ఆయన అన్నారు.

ప్రతిపక్షంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లు ఎన్నికల అపడవిట్ లో ఏలాంటి భూములు లేవని పేర్కొన్నారని ఇప్పుడు భవనాలు వందలాది ఎకరాల భూములు.. హైదరాబాద్ సరౌండింగ్ లో కోట్లాది రూపాయల ఆస్తులు ఎలా ఉన్నాయని ముఖ్యమంత్రి అడిగినా దానికి కెసిఆర్ కేటీఆర్ లు శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రాంతానికి చెందిన పద్మశాలిని ఎమ్మెల్సీగా చేస్తామని ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాబోవు శాసనసభ ఎన్నికలలో సిరిసిల్లా శాసనసభ నియోజకవర్గం నుంచి ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవిని ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని ఆయన గుర్తు చేశారు.

వేములవాడ శాసనసభ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు 1000 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారని సిరిసిల్లలో అభివృద్ధికి 350 కోట్లు పైగా సీఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయించడం జరిగిందని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ మండల అధ్యక్షులు సంధ్య లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాడి రాంరెడ్డి, బండారి బాల్ రెడ్డి, నంది కిషన్, వంగ గిరిధర్, తేజ శ్రీనివాస్ గౌడ్, రామ్సింగ్ నాయక్, వంగ శ్రీకాంత్ రెడ్డి, మెండే శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### నేతన్న విగ్రహానికి నివాళులు అర్పించకపోవడం

## పద్మశాలీల ఆత్మగౌరవాన్ని అవమానించడమే



**-చేనేత రంగానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి: పద్మశాలి యువజన సంఘం**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనలో నేతన్న విగ్రహానికి కనీసం పూలమాల వేసి నివాళులు అర్పించకపోవడం పద్మశాలి సమాజం పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు సబ్బని హరీష్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌక్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నేతన్న విగ్రహానికి నివాళులు అర్పించడంతో పాటు చేనేత రంగానికి పలు కీలక ప్రకటనలు చేస్తారని ఆశించామని, అయితే తమ ఆశలు నెరవేరలేదని పేర్కొన్నారు.

సిరిసిల్ల అంటే చేనేత.. చేనేత అంటే నేతన్న.. నేతన్న అంటే పద్మశాలి సమాజం అని అన్నారు. సిరిసిల్ల చేనేత కార్మికుల శ్రమ, త్యాగాలకు ప్రతీకగా నిలిచిన నేతన్న విగ్రహానికి గౌరవం ఇవ్వడం అంటే మొత్తం చేనేత కార్మికుల శ్రమకు గౌరవం ఇవ్వడమేనని పేర్కొన్నారు.టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని సిరిసిల్ల పద్మశాలీలకు ప్రకటిస్తారని, చేనేత రంగానికి కొత్త ఆర్డర్లు ఇస్తారని, వర్కర్-ఓనర్ పథకాన్ని అమలు చేస్తారని, ఆత్మహత్యలకు పాల్పడిన 35 మంది నేత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తారని ఆశించామని తెలిపారు.

నేతన్నల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, ఆత్మహత్యలకు పాల్పడిన 35 మంది నేత కార్మికుల కుటుంబాలకు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్యాకేజీ, ఉపాధి భద్రత, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు.

సిరిసిల్ల చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, నేతన్నలకు గౌరవం, చేనేత కార్మికులకు ఉపాధి, భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పద్మశాలి సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమని, చేనేత రంగానికి న్యాయం జరిగే వరకు తమ గొంతును వినిపిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు గౌరిటాల నవీన్‌కుమార్, డైరెక్టర్లు బింగి పాండుకుమార్, ఒగ్గు అరవింద్, మార నరేష్, ప్రశాంత్, పాము కార్తీక్, దూస నరేష్, గౌడ సాత్విక్, ఆడెపు నిఖిల్, కొండ సాయి, గాజర్ల ప్రశాంత్, హర్షణపెల్లి వేణు, బచ్చు భరత్, అవధూత శ్రీకాంత్, వేముల వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

బలగం టీవీ, గంభీరావుపేట:

గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ బిచ్చల రాజారాంరెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి గురువారం మల్లారెడ్డిపేటకు చేరుకుని రాజారాంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తిమ్మాపూర్ సర్పంచ్ అందె సుభాష్, సర్పంచ్ మహేష్ యాదవ్, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీలు రాజేందర్, హన్మండ్లు, ఉపసర్పంచ్ బాబు, నాయకులు సోమరాపు సాగర్, మంద రవి, బండ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించేందుకు స్పెషల్ ఎడ్యుకేటర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మొండయ్య తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు. ఎంపికైన స్పెషల్ ఎడ్యుకేటర్లకు నెలకు రూ.16,500 వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. నియామకానికి సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ఖాళీల వివరాలు తదితర పూర్తి సమాచారాన్ని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి తెలుసుకోవాలని డీఈఓ సూచించారు.




## పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో గణేష్ నిమజ్జనం, సీఎం పర్యటన విజయవంతం..

**- జిల్లా ఎస్పీకి అభినందనలు తెలిపిన పోలీస్ అధికారుల సంఘం సభ్యులు..**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన, గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆధ్వర్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముందస్తు ప్రణాళికతో సమర్థవంతమైన బందోబస్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ నిమజ్జనం, ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఐపీఎస్ ని జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు గురువారం రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, సమర్థవంతమైన విధుల నిర్వహణలో ఎస్పీ చూపిన నాయకత్వాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షులు ఎస్.ఐ వెంకట్రాజం, సెక్రటరీ నాగేశ్వరరావు, శ్రీనాథ్ రాజ్, ప్రకాష్, వేణు, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

## అడవి పదిర పంచాయతీలో ఎలాంటి విభేదాలు లేవు

**-సర్పంచ్ భర్త పెత్తనంపై వార్డు సభ్యుల అసహనం అంటూ వచ్చిన కథనం అవాస్తవం..**

**- వార్డు సభ్యుల సంయుక్త ఖండన**

**– గ్రామాభివృద్ధికి సర్పంచ్‌తో కలిసి పనిచేస్తున్నాం : వార్డు సభ్యులు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామ పంచాయతీకి సంబంధించి "సర్పంచ్ భర్త పెత్తనంపై వార్డు సభ్యుల అసహనం" అనే శీర్షికతో ప్రచురితమైన వార్తలో వాస్తవాలు లేవని ఉపసర్పంచ్, వార్డు సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఉపసర్పంచ్ మడుపు తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు మాట్ల రాజు, చందాల ప్రదీప్, బైరి ప్రపూర్ణ, భూక్యా రవి, బైరి హారిక సంయుక్తంగా ఒక ఖండన ప్రకటన విడుదల చేశారు.

వార్తలో పేర్కొన్న విధంగా వార్డు సభ్యులమైన తాము సర్పంచ్‌పై గానీ, వారి కుటుంబ సభ్యులపై గానీ ఎలాంటి అసహనం వ్యక్తం చేయలేదని, ఎవరికీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. తమతో సంబంధం లేని విషయాలను వార్డు సభ్యుల అభిప్రాయాలుగా పేర్కొంటూ వార్త ప్రచురించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో సర్పంచ్‌తో తమకు సత్సంబంధాలు ఉన్నాయని, వార్డు సభ్యులందరం సమిష్టిగా, శాంతియుతంగా గ్రామాభివృద్ధి కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

**గ్రామ పంచాయతీ అడవి పదిర,వీర్నపల్లి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా.**

**ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు..**

1)మడుపు తిరుపతి రెడ్డి...ఉపసర్పంచ్ - 9493886183

2) మాట్ల రాజు (వార్డు సభ్యులు) - 8106466982

3) చందాల ప్రదీప్ (వార్డు సభ్యులు) - 9573464862

4) బైరి ప్రపూర్ణ (వార్డు సభ్యులు) - 8500189064

5)భూక్యా రవి (వార్డు సభ్యులు) - 8500499557

6)బైరి హరిక (వార్డు సభ్యులు) - 893006971




## ఓటు హక్కును హరిస్తే సహించేది లేదు

**-ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల తొలగింపును నిలిపివేయాలి**

**-తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలి**

**-అఖిలపక్షం డిమాండ్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అఖిలపక్ష పార్టీల నాయకులు అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఎనగందుల వెంకన్న, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కడారి రాములు, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి సోమశెట్టి దశరథం మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘమే ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల్లో ఆందోళన కలిగించే విధంగా వ్యవహరిస్తోందని అన్నారు .

ఎస్ఐఆర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి భారీ సంఖ్యలో పేర్లు తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా అన్యాయంగా జాబితా నుంచి తొలగించబడకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ఏ ఒక్క పార్టీకి చెందిన ఆస్తి కాదు.. ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయని నాయకులు తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లకు సంబంధించిన వివరాలను బహిరంగపరచాలని, ప్రతి ఓటరుకు తన అభ్యంతరాన్ని నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలపై తలెత్తిన ప్రశ్నలకు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా పూర్తి పారదర్శకత పాటించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. చట్టపరమైన విచారణలో బాధ్యత లేదా నేరం నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు గురజాల శ్రీధర్, సూరం పద్మ, అన్నదాస్ గణేష్, శ్రీరాముల రమేష్‌చంద్ర, సీనియర్ నాయకులు శ్రీరాం సదానందం, నాయకులు ఆడేపు రజిత, సీపీఐ నాయకురాలు అనసూర్య, సీపీఐ(ఎంఎల్) నాయకులు గుజ్జె దేవదాస్, సలేంద్ర ఎల్లయ్య, పంతం సుజాత, గాజుల కళావతి, బీఎస్పీ నాయకులు మంచికట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్‌లో నకిలీ భారత కరెన్సీతో ఇద్దరు భారతీయుల అరెస్ట్

### రూ.500 నోట్ల 70 నకిలీ కరెన్సీ నోట్లు స్వాధీనం

బలగం టీవీ, హైదరాబాద్

నకిలీ భారత కరెన్సీ నోట్లతో వెళ్తున్న ఇద్దరు భారతీయులను నేపాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోషి ప్రావిన్స్‌లోని ఝాపా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. అరెస్టయిన వారిని బిహార్‌కు చెందిన అబ్దుల్ మజీద్ (25), రుబేద్ ఆలం (26)గా గుర్తించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత నంబర్ ప్లేట్ ఉన్న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వీరి వద్ద రూ.500 విలువైన 70 నోట్లను గుర్తించారు. వాటి మొత్తం విలువ రూ.35 వేలుగా ఉంది. అనుమానం రావడంతో నోట్లను నేపాల్ రాష్ట్ర బ్యాంకు బిరాట్‌నగర్ శాఖకు పంపి పరిశీలించగా నకిలీవిగా తేలినట్లు పోలీసులు తెలిపారు.

నిందితులను ఐదు రోజుల న్యాయ రిమాండ్‌కు తరలించి, ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు.



## అఫ్గాన్‌లో పాక్ వైమానిక దాడులు

### 22 మంది ఉగ్రవాదులు హతమైనట్లు పాకిస్థాన్ ప్రకటన.. 9 మంది పౌరులు మృతి చెందారన్న తాలిబన్ ప్రభుత్వం

బలగం టీవీ, హైదరాబాద్

అఫ్గానిస్థాన్‌లోని రెండు ప్రాంతాల్లో ఉగ్రవాదుల స్థావరాలపై లక్షిత వైమానిక, డ్రోన్ దాడులు నిర్వహించి 22 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్థాన్ గురువారం ప్రకటించింది. దాడుల్లో తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ), బలూచ్ మిలిటెంట్ గ్రూపులకు చెందిన స్థావరాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ధ్వంసం చేసినట్లు పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ తెలిపింది.

విశ్వసనీయ నిఘా సమాచారంతో అఫ్గానిస్థాన్‌లోని రెండు ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలు, స్థావరాలను కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకున్నట్లు పాక్ పేర్కొంది. దాడుల్లో 22 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ప్రాథమిక సమాచారం అందిందని తెలిపింది. పౌరులకు నష్టం కలగకుండా గరిష్ఠ జాగ్రత్తలు తీసుకున్నామని పాక్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అయితే పాకిస్థాన్ వైమానిక దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా తొమ్మిది మంది అఫ్గాన్ పౌరులు మృతి చెందగా, మరో 11 మంది గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. కునార్ ప్రావిన్స్‌లోని చుగామ్, షల్తాన్ జిల్లాతోపాటు హెల్మండ్ ప్రావిన్స్‌లోని గర్మ్‌సెర్ జిల్లాలోని సఫర్ ప్రాంతంలో దాడులు జరిగినట్లు తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. మూడు ఇళ్లు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు.

ఈ దాడులతో ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. అఫ్గాన్ భూభాగం నుంచి టీటీపీ, ఇతర మిలిటెంట్ సంస్థలు పాకిస్థాన్‌పై దాడులకు పాల్పడుతున్నాయని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను అఫ్గాన్ తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తోంది. ఉగ్రవాద స్థావరాలను నిర్మూలించే తమ చర్యలు కొనసాగుతాయని పాకిస్థాన్ స్పష్టం చేసింది.



## అంతరిక్ష కేంద్రానికి నలుగురు వ్యోమగాములు

### స్పేస్‌ఎక్స్ ప్రయోగం విజయవంతం.. ఆరు నెలల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో బస

బలగం టీవీ, హైదరాబాద్

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి నలుగురు వ్యోమగాములతో స్పేస్‌ఎక్స్ గురువారం విజయవంతంగా బయలుదేరింది. నాసా కోసం చేపట్టిన ఈ ప్రయోగంలో కమాండర్ జెస్సికా వాట్కిన్స్‌తో పాటు లూక్ డెలానీ, కెనడాకు చెందిన జాషువా కుట్రిక్, రష్యాకు చెందిన సెర్గే టెటెర్యాత్నికోవ్ ఉన్నారు. వీరు సుమారు ఆరు నెలల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉండనున్నారు.

కేప్ కెనావెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి గురువారం ఉదయం ప్రయోగం జరిగింది. ఇంధన వ్యవస్థలో లీకేజీని సరిచేయాల్సి రావడంతో మూడు వారాల ఆలస్యమైన ఈ ప్రయోగం పూర్తయింది. ప్రయోగం అనంతరం కేవలం ఎనిమిది గంటల్లోనే వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోనున్నారు.

ఈ ప్రయోగంతో జెస్సికా వాట్కిన్స్ అంతరిక్షంలోకి సిబ్బందిని నడిపించిన తొలి నల్లజాతి మహిళగా గుర్తింపు పొందారు. భూగర్భ శాస్త్రవేత్త అయిన ఆమె గతంలో నాసా మార్స్ రోవర్ క్యూరియాసిటీ కార్యక్రమంలో పనిచేశారు. 2022లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆమెకు ఇది రెండో అంతరిక్ష ప్రయాణం.

మిగిలిన ముగ్గురికీ ఇదే తొలి అంతరిక్ష ప్రయాణం. లూక్ డెలానీ మాజీ మెరైన్, జాషువా కుట్రిక్ రాయల్ కెనడియన్ ఎయిర్‌ఫోర్స్‌లో కల్నల్‌గా పనిచేశారు. సెర్గె టెటెర్యాత్నికోవ్ గతంలో జలాంతర్గామిలో పనిచేశారు. వీరు ఫిబ్రవరి నుంచి అంతరిక్ష కేంద్రంలో ఉన్న నలుగురు వ్యోమగాముల స్థానాన్ని భర్తీ చేయనున్నారు.

స్పేస్‌ఎక్స్ నాసా కోసం చేపట్టిన 13వ మానవ సహిత ప్రయోగం ఇది. అపోలో-13 స్ఫూర్తితో ఈ మిషన్‌కు 'క్రూ-13'గా పేరు పెట్టారు. 1970లో అపోలో-13 చంద్రయాత్రలో ఎదురైన తీవ్ర సమస్యల మధ్య వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకున్న ఘటనను గుర్తుచేసుకుంటూ ఈ పేరును ఎంపిక చేశారు.

ఇదిలా ఉండగా, జాషువా కుట్రిక్ భార్య హీథర్ నవంబర్ చివర్లో మూడో బిడ్డకు జన్మనివ్వనున్నారు. దీంతో భూమికి దూరంగా ఉన్న సమయంలో తండ్రి కానున్న నాలుగో పురుష వ్యోమగామిగా కుట్రిక్ నిలవనున్నారు. కుటుంబంతో నిరంతరం సంబంధాలు కొనసాగించేలా నాసా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

## దుబాయ్‌లో గుండెపోటుతో చందుర్తి యువకుడు మృతి...

బలగం టీవీ,చందుర్తి



చందుర్తి మండలానికి చెందిన చిలుక రవి అనే యువకుడు మూడు రోజుల క్రితం దుబాయ్‌లోని షార్జాలో గుండెపోటుతో మృతి చెందాడు. రవి మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు రవికి భార్య, ఒక కుమారుడు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విదేశాల్లో పనిచేస్తున్న యువకుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. భార్య పేరు సుజాత కుమార్ పేరు అచ్చు బిడ్డ పేరు శ్రేయ

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్ అమలు

### అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, సభలు నిర్వహించరాదు: ఎస్పీ మహేష్ బి.గితే

బలగంటీవీ, రాజన్న సిరిసిల్ల



శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం ఈ నిబంధనలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని సూచించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పోలీసు సిబ్బందికి అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

## అమెరికా రక్షణ రంగంలో భారీ విప్లవం

### 'ప్రాజెక్ట్ మెరిడియన్' అధినేతగా ఎలాన్ మస్క్!

బలగం టీవీ, వాషింగ్టన్/హైదరాబాద్



అమెరికా రక్షణ రంగ భవిష్యత్తును పూర్తిగా ఆవిష్కరించే దిశగా డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ యుద్ధాలు, సాంకేతిక పరిణామాలపై అధ్యయనం చేసేందుకు 'ప్రాజెక్ట్ మెరిడియన్' పేరుతో ఉన్నత స్థాయి సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు ప్రపంచ టెక్ దిగ్గజం, స్పేస్‌ఎక్స్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నాయకత్వం వహించనున్నారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ గురువారం నిర్వహించిన 'స్టేట్ ఆఫ్ ది ఫోర్స్' ప్రసంగంలో ఈ వివరాలను అధికారికంగా వెల్లడించారు. అమెరికా సైనిక వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించి, సాంకేతికంగా శత్రు దేశాల కంటే ముందుంచడమే దీని ప్రధాన లక్ష్యం.

ప్రైవేట్ మేధావులతో పవర్ ఫుల్ టీమ్: ఈ ప్యానెల్‌లో కేవలం రక్షణ శాఖ అధికారులే కాకుండా ప్రైవేట్ రంగానికి చెందిన ప్రముఖులను భాగస్వాములను చేశారు. ఎలాన్ మస్క్‌తో పాటు డిఫెన్స్ టెక్ దిగ్గజం 'అండూరిల్ ఇండస్ట్రీస్' వ్యవస్థాపకుడు పాల్ లక్కీ, మాజీ హౌస్ స్పీకర్ న్యూట్ గ్రింగ్రిచ్‌లు ఈ కమిటీలో సహాయకులుగా వ్యవహరించనున్నారు. రక్షణ శాఖ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఎమిల్ మైఖేల్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తుంది. "భవిష్యత్ యుద్ధాలను అంచనా వేసే అత్యుత్తమ మేధావులు కేవలం పెంటగాన్ నాలుగు గోడల మధ్యే ఉండరు. ప్రైవేట్ రంగంలోని సరికొత్త ఆలోచనలను రక్షణ వ్యూహాలకు అనుసంధానించడమే మా ఉద్దేశం" అని పీట్ హెగ్సెత్ పేర్కొన్నారు.

120 రోజుల గడువు.. సీక్రెట్ రిపోర్ట్: ఈ ప్రాజెక్ట్‌కు రక్షణ శాఖ 120 రోజుల స్వల్ప గడువును విధించింది. ఈ వ్యవధిలోనే భవిష్యత్ యుద్ధాల సరళి, సాంకేతికతల గమనంపై అధ్యయనం పూర్తి చేసి సైనిక నాయకత్వానికి ఒక రహస్య నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే స్పేస్‌ఎక్స్ పెంటగాన్‌కు కీలక కాంట్రాక్టర్‌గా ఉంటే, అండూరిల్ ఇండస్ట్రీస్ AI ఆధారిత ఆయుధ వ్యవస్థలను రూపొందిస్తోంది.

మరిన్ని కీలక ప్రకటనలు:

అటానమస్ వార్‌ఫేర్ కమాండ్: రోబోటిక్, స్వయంప్రతిపత్త (Autonomous) సైనిక సామర్థ్యాలను వేగంగా విస్తరించేందుకు కొత్తగా ఫోర్-స్టార్ కాంబాట్ కమాండ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు హెగ్సెత్ ప్రకటించారు.

ఫోర్ట్రెస్ అమెరికా: అమెరికా సైనిక స్థావరాలను సైబర్ దాడులు, విద్రోహ చర్యల నుంచి సంరక్షించి, పూర్తి స్వయం సమృద్ధిగా మార్చేందుకు 'ఫోర్ట్రెస్ అమెరికా' ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. దీనిని దేశానికి ఒక "జాతీయ బీమా పాలసీ"గా రక్షణ మంత్రి అభివర్ణించారు.

## ఫ్లైదుబాయ్ విమానంలో హైడ్రామా




### భారత పైలట్ సాహసంతో తప్పిన ముప్పు! నెతన్యాహు ప్రశంసలు

బలగం టీవీ, హైదరాబాద్

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు 174 మంది ప్రయాణికులతో వెళ్తున్న 'ఫ్లైదుబాయ్' (FZ1073) విమానంలో ఒమన్ పౌరుడైన కో-పైలట్ కాక్‌పిట్‌లో చేసిన కుట్ర ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ప్రయాణంలో ఉండగా 34,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో కో-పైలట్ అకస్మాత్తుగా భారతీయ ప్రధాన పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అనంతరం విమానం కంట్రోల్ స్టిక్‌ను కిందకు నెట్టడంతో విమానం ఏకంగా 18,000 అడుగుల కిందకు పడిపోయింది. తీవ్ర రక్తమోడుతున్న స్థితిలోనూ ధైర్యం వీడని కెప్టెన్ స్మిత్ మచ్చర్ తక్షణమే '7500' హైజాకింగ్ డిస్ట్రెస్ కోడ్‌ను జారీ చేసి కాక్‌పిట్ తలుపును అన్‌లాక్ చేశారు. వెంటనే విమానంలో ఉన్న ఇజ్రాయెల్ ప్రయాణికుడు యానిక్ మరికొందరు ప్రయాణికులతో కలిసి కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లి నిందితుడిని బంధించారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు.

యుఏఈ ఉన్నత స్థాయి దర్యాప్తు.. నెతన్యాహు ప్రశంసలు

ఈ ఘోర ఘటనపై యుఏఈ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. విమానం యుఏఈ పతాకంతో నమోదై ఉన్నందున విదేశీ గగనతలంలో నేరం జరిగినప్పటికీ తమ చట్టాలే వర్తిస్తాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం సౌదీ పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని తొలిదశ విచారణ అనంతరం యుఏఈకి అప్పగించనున్నారు. ఫాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందిస్తూ, ప్రాణాలకు తెగించి 174 మంది ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్, ఇజ్రాయెల్ ప్రయాణికుల ధైర్యసాహసాలను కొనియాడారు. నిందితుడికి ఇజ్రాయెలీలపై తీవ్రమైన ద్వేషం, మత ఛాందసవాదం ఉన్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు.

వెలుగులోకి నిందితుడి ఛాందసవాద నేపథ్యం

ఈ దాడికి పాల్పడిన ఒమన్ కో-పైలట్ గురించి దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అతడు కేవలం ఎనిమిది నెలల క్రితమే కంపెనీలో చేరాడని, తీవ్రమైన మతాచారాలు పాటించే ఛాందసవాది అని తోటి పైలట్ ఒకరు వెల్లడించారు. రోజంతా ప్రార్థనల్లో గడపడమే కాకుండా మహిళలతో కరచాలనం చేయడానికి కూడా తిరస్కరించేవాడని తెలిపారు. మరోవైపు ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని ఒమన్ పౌరుడిని ఈ రూట్‌లో విమానం నడిపేందుకు ఎలా అనుమతించారని ఇజ్రాయెల్ రవాణా శాఖ మంత్రి మిరీ రెగెవ్ ప్రశ్నించగా, అతనికి ఉన్న ద్విపౌరసత్వమే దానికి కారణమై ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, బ్లాక్ బాక్స్ డేటాను విశ్లేషిస్తున్న అధికారులు ఈ దారుణ కుట్ర వెనుక ఏమైనా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల హస్తం ఉందా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

## ఇజ్రాయెల్ విమానంపై దాడిలో ఇరాన్ ప్రమేయమా?

### ఫ్లైదుబాయ్ సహ పైలట్‌పై ట్రంప్ అనుమానం.. 'దాడి వెనుక ఇరాన్ ఉంటే తీవ్రంగా దెబ్బతీస్తాం'

బలగం టీవీ, హైదరాబాద్



ఇజ్రాయెల్ వెళ్లే ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన సహ పైలట్‌కు ఇరాన్‌తో సంబంధాలు ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ఇరాన్ ప్రమేయం ఉన్నట్లు తేలితే తీవ్రంగా స్పందిస్తామని ఆయన హెచ్చరించారు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి టెల్‌అవీవ్‌కు 174 మందితో వెళ్తున్న విమానంలో సహ పైలట్ కెప్టెన్‌పై కత్తితో దాడి చేసి కాక్‌పిట్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన కెప్టెన్ ప్రయాణికులను కాక్‌పిట్‌లోకి అనుమతించడంతో వారు సహ పైలట్‌ను అదుపులోకి తీసుకుని విమానాన్ని నియంత్రించేందుకు సిబ్బందికి సహకరించారు. అనంతరం విమానం సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా ల్యాండ్ అయింది.

ఈ ఘటనకు సంబంధించి అరెస్టయిన సహ పైలట్ ఒమన్ పౌరుడని ప్రాంతీయ అధికారి తెలిపారు. ఉగ్రవాదం నుంచి మానసిక సమస్యల వరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ప్రస్తుతం ఏ అవకాశాన్నీ కొట్టిపారేయడం లేదన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం సహ పైలట్ ఇస్లామిస్ట్ భావజాలానికి ప్రభావితమై ఉండొచ్చని పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై దర్యాప్తు పూర్తయ్యే వరకు ఇరాన్ ప్రమేయంపై స్పష్టత లేదని ఆయన తెలిపారు.

విమానంలో కాక్‌పిట్ నుంచి అత్యవసర సంకేతాలుగా '7700', '7500' కోడ్‌లు పంపినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ సంస్థ ఫ్లైట్‌రాడార్24 తెలిపింది. '7500' కోడ్‌ను విమానంపై అక్రమ జోక్యం లేదా హైజాకింగ్ వంటి పరిస్థితులను సూచించేందుకు ఉపయోగిస్తారు.

విమానంలో ఎక్కువ మంది ఇజ్రాయెల్ పౌరులే ఉండగా, భారత్, యూఏఈకి చెందిన వారు కూడా ఉన్నారు. నలుగురు అమెరికా పౌరులు ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ఘటన అనంతరం ఇజ్రాయెల్‌కు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమానాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఫ్లైదుబాయ్ ప్రకటించింది.

విమాన కెప్టెన్ భారతీయుడని, ఆయన అబుదాబిలో చికిత్స పొందుతున్నారని భారత ప్రభుత్వం తెలిపింది. తీవ్రంగా గాయపడినప్పటికీ ప్రయాణికులను కాక్‌పిట్‌లోకి అనుమతించడం, విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన కెప్టెన్‌ను పలువురు ప్రశంసించారు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికా, ఒమన్ అధికారులు దర్యాప్తులో సహకరిస్తున్నారు.

## సిరిసిల్ల సభలో అభివృద్ధి మాట లేదు.. వ్యక్తిగత విమర్శలే

### -కేసీఆర్, కేటీఆర్‌పై విమర్శలకే సీఎం ప్రాధాన్యం
### -కేసీఆర్ హయాంలోని ప్రాజెక్టులకే రిబ్బన్లు కట్ చేయడం తప్ప కొత్తగా చేసిందేమిటి?
### -సిరిసిల్ల అభివృద్ధిని చూసి కొడంగల్‌ను అభివృద్ధి చేయాలి..
### బీఆర్ఎస్ నేతలు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :



సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభలో అభివృద్ధి అంశాలపై మాట్లాడకుండా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యం ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ భవన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు మీడియా సమావేశం నిర్వహించి సీఎం వ్యాఖ్యలను ఖండించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సభకు వస్తున్న సందర్భంగా ప్రజలు కొత్త అభివృద్ధి ప్రాజెక్టులు, నిధుల ప్రకటనలు ఆశించారని, అయితే ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు తప్ప కొత్తగా చెప్పడానికి ఏమీ లేకపోయిందన్నారు. కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి, రివర్ ఫ్రంట్, కలెక్టరేట్ వంటి అనేక ప్రాజెక్టులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులకు రిబ్బన్లు కట్ చేయడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలో కొత్తగా మంజూరు చేసిన పెద్ద ప్రాజెక్టు ఏమిటో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. సిరిసిల్ల సభలో రైతులు, సాగునీరు, చేనేత కార్మికులు, ఉపాధి అంశాలపై సీఎం మాట్లాడతారని ప్రజలు ఆశించారని, కానీ కేసీఆర్, కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలకే సభ పరిమితమైందన్నారు. కేటీఆర్ హయాంలో సిరిసిల్లలో విద్య, మౌలిక వసతులు, చేనేత రంగంలో చేపట్టిన కార్యక్రమాలతో పట్టణానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. సిరిసిల్ల అభివృద్ధిని చూసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. చేనేత కార్మికుల కోసం తీసుకొచ్చిన వర్కర్ టు ఓనర్ పథకం ఎందుకు నిలిచిపోయిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను కూడా ప్రస్తుత ప్రభుత్వం తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 8 వేల ఎకరాల భూముల వ్యవహారంపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరామని, సీఎం చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందు ఉంచాలని అన్నారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ ఫ్లైఓవర్ వరకు గతంలోనే అనుమతులు, ప్రతిపాదనలు, లేఖల ప్రక్రియ జరిగిందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. సిరిసిల్ల ప్రజలు అభివృద్ధిని కోరుకుంటారని, వ్యక్తిగత దూషణల రాజకీయాలను కోరుకోవడం లేదన్నారు. సిరిసిల్లను రాజకీయ కక్షలకు వేదికగా కాకుండా అభివృద్ధికి నమూనాగా చూడాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు సిరిసిల్ల, వేములవాడ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్మించిన భవనాలకు రిబ్బన్లు కట్ చేయడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేస్తున్న అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. కేటీఆర్ సిరిసిల్లలో చేసిన అభివృద్ధిలో కనీసం పది శాతం అయినా తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో చేసి చూపించాలని సవాల్ చేశారు. హుజురాబాద్‌కు రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

చేనేత రంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వర్కర్ టు ఓనర్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని, జిల్లాకు కొత్త అభివృద్ధి ప్రాజెక్టులు ప్రకటించాలని కోరారు. హుజురాబాద్‌కు రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేసి, రూ.1,000 కోట్ల అభివృద్ధి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేనేత రంగం పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని, గత ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు బయటపెట్టాలని కోరారు. సమావేశంలో , డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, పుట్టా మధు, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి, ద్యావ వసంత, మాజీ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# పాక్‌ను చిత్తు చేసిన భారత్..

## హాకీ ఫైనల్‌కు ఇండియా

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా గేమ్స్ 2026లో భారత పురుషుల హాకీ జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన హోరాహోరీ సెమీఫైనల్ సమరంలో దాయాది పాకిస్థాన్‌ను 4-3 తేడాతో భారత్ మట్టికరిపించింది. ఆఖరి నిమిషం వరకు తీవ్ర ఉత్కంఠగా సాగిన ఈ పోరులో 60వ నిమిషంలో భారత ఆటగాడు అభిషేక్ మెరుపు ఫీల్డ్ గోల్ సాధించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఆదివారం జరగబోయే తుదిపోరులో మలేషియా, సౌత్ కొరియా మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో భారత్ పసిడి పతకం కోసం తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత జట్టుకు స్వర్ణంతో పాటు నేరుగా 'లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్' బెర్త్ లభించనుంది.

భారత్ దాడి.. హర్మన్‌ప్రీత్ దెబ్బ: మ్యాచ్ ఆరంభం నుంచే భారత్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆట 5వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలచడంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 13వ నిమిషంలో మరో పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ గోల్‌గా మార్చడంతో భారత్ ఆధిక్యం 2-0కి పెరిగింది. రెండో క్వార్టర్‌లోనూ దాడి కొనసాగించిన భారత్ తరఫున 23వ నిమిషంలో సుఖ్‌జిత్ సింగ్ అద్భుత ఫీల్డ్ గోల్ చేయడంతో ఆధిక్యం 3-0కి చేరింది. అయితే 30వ నిమిషంలో పాక్ కెప్టెన్ అబూ బాకర్ మహమూద్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో తొలి సగం ముగిసేసరికి భారత్ 3-1తో నిలిచింది.

పుంజుకున్న పాక్.. అభిషేక్ మ్యాజిక్: రెండో సగంలో పాకిస్థాన్ గట్టిగా పుంజుకుంది. భారత ప్లేయర్ దిల్‌ప్రీత్ సింగ్ గ్రీన్ కార్డ్‌తో మైదానం వెలుపలకు వెళ్లడం పాక్‌కు కలిసివచ్చింది. పాక్ ఆటగాళ్లు హనన్ షాహిద్ (45వ నిమిషం), వాహిద్ రాణా (49వ నిమిషం) చెరో ఫీల్డ్ గోల్ కొట్టడంతో స్కోర్లు 3-3తో సమమయ్యాయి. మ్యాచ్ డ్రాగా ముగిసి షూటౌట్‌కు వెళ్తుందనుకుంటున్న తరుణంలో, 60వ నిమిషంలో అభిషేక్ చేసిన సంచలన గోల్‌తో భారత్ 4-3తో విజయాన్ని కైవసం చేసుకుంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్ చేయగా, సుఖ్‌జిత్, అభిషేక్ చెరో గోల్ సాధించారు.

# ఆసియా క్రీడలు.. క్రికెట్‌లో ఫైనల్‌కు భారత్

## శ్రీలంకపై భారత్ ఘన విజయం..
## ఫైనల్‌లో భారత్ వర్సెస్ పాకిస్థాన్..
## శనివారం టీ20 బిగ్ ఫైట్!

బలగం టీవీ, హైదరాబాద్

ఇషాన్ కిషన్, బౌలర్ల విజృంభణ: తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 169 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. పరుగులు తీసేందుకు కష్టంగా ఉన్న పిచ్‌పై వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. 46 బంతుల్లోనే 80 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా, ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (21 బంతుల్లో 38; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలక పరుగులు జోడించాడు. అనంతరం 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన





శ్రీలంకను భారత బౌలర్లు అతలాకుతలం చేశారు. జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, అభిషేక్ శర్మ తలా రెండు వికెట్లతో చెలరేగడంతో లంక జట్టు కేవలం 9.5 ఓవర్లలో 45 పరుగులకే కుప్పకూలింది. లంక ఇన్నింగ్స్‌లో ఏకంగా ఐదుగురు బ్యాటర్లు డకౌట్ కాగా, ఫెర్నాండో ఒక్కడే రెండంకెల స్కోరు చేయగలిగాడు.

**బంగ్లాను ఓడించి ఫైనల్‌కు పాకిస్థాన్**

మరోవైపు బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి సెమీఫైనల్లో పాకిస్థాన్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్ చేరుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 13 ఓవర్లలో 7 వికెట్లకు 111 పరుగులు చేయగా, పాకిస్థాన్ 11.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. పాక్ బ్యాటర్లలో అబ్దుల్ సమద్ (30), నవాజ్ (27) రాణించి జట్టును గెలిపించారు. దీంతో శనివారం జరగనున్న పసిడి పోరులో దాయాది దేశాలు భారత్-పాకిస్థాన్ జట్లు బంగారు పతకం కోసం ఢీకొట్టనున్నాయి.

ఏషియన్ గేమ్స్ టీ20 క్రికెట్ పోటీల్లో ఆసక్తికర సమరానికి వేదిక సిద్ధమైంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్లు శనివారం జరగబోయే ప్రతిష్టాత్మక గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. జపాన్‌లోని నిషిన్‌లో జరిగిన రెండో సెమీఫైనల్ పోరులో శ్రీలంకపై 124 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన భారత జట్టు సగర్వంగా ఫైనల్లోకి అడుగుపెట్టింది.



# బ్యాటింగ్ పిచ్‌లతో ఏం ఫాయిదా?

## బౌలర్లకు కూడా అవకాశం ఉండాలి..
## ఇది క్రికెట్ కాదు, కేవలం బ్యాటింగ్ మాత్రమే: గౌతమ్ గంభీర్

బలగం టీవీ, హైదరాబాద్

బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించే పిచ్‌లతో ఏం ఫాయిదా అని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశ్నించాడు. భారత్-వెస్టిండీస్ మధ్య జరిగిన రెండో వన్డేలో భారీ స్కోర్లు నమోదవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇలాంటి పిచ్‌లపై బౌలర్లకు కూడా పోటీ ఇచ్చే అవకాశం ఉండాలని పేర్కొన్నాడు.

గౌహతి వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్ 405 పరుగులు చేయగా.. భారత్ 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్‌లో ఏకంగా ఐదుగురు బ్యాటర్లు శతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో గంభీర్ మాట్లాడుతూ.. ''బ్యాట్‌కు, బంతికి మధ్య పోటీ ఉండాలి. ఇది ఏ మాత్రం క్రికెట్ కాదు.. కేవలం బ్యాటింగ్ మాత్రమే. 400కుపైగా పరుగులు చేయడం, ఆ తర్వాత ఆ లక్ష్యాన్ని ఛేదించడం రికార్డుల పరంగా, ప్రేక్షకులకు ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కానీ నిజమైన క్రికెట్ అభిమానిగా, కోచ్‌గా నేను అసంతృప్తిగానే ఉన్నా'' అని అన్నాడు.

బౌలర్లకు కూడా అవకాశం కల్పించేలా పిచ్‌లు ఉండాలని గంభీర్ సూచించాడు. ''ఇలాంటి వికెట్‌పై ఓ యువ బౌలర్ బౌలింగ్ చేస్తే అతని మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. కేవలం బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లను తయారు చేయడం సరికాదు. బౌలర్లను కూడా దృష్టిలో పెట్టుకోవాలి'' అని పేర్కొన్నాడు. అరంగేట్ర పేసర్ అకిబ్ నబీతో పాటు ఇతర బౌలర్లకు ఈ మ్యాచ్ అనుకూలించలేదని, వచ్చే మ్యాచ్‌లోనూ అకిబ్‌కు అవకాశం ఇస్తామని స్పష్టం చేశాడు.

ప్రపంచకప్ 2027కు ఇంకా ఏడాది సమయం మాత్రమే ఉందని గంభీర్ తెలిపాడు. ఆ టోర్నీకి ముందు మహా అయితే మరో 20 వన్డేలు మాత్రమే ఆడే అవకాశం ఉందని, ఈ సమయంలో విభిన్న కాంబినేషన్లను పరీక్షిస్తామని చెప్పాడు. ఐపీఎల్ అనంతరం ప్రధాన ఆటగాళ్లతో ఎక్కువ మ్యాచ్‌లు ఆడిస్తామని, అప్పటివరకు కొత్త ఆటగాళ్లకు అవకాశాలు ఇస్తామని పేర్కొన్నాడు. పవర్‌ప్లే, డెత్ ఓవర్లలో గుర్నూర్ బ్రార్ బౌలింగ్ చేయడాన్ని కూడా ప్రస్తావించాడు.

# ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తొలి పోరు

## అక్టోబర్ 7న కేప్‌టౌన్‌లో మ్యాచ్..
## 10న పాకిస్థాన్‌తో ఢీ
## మెగా టోర్నీ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు
## ఫైనల్ నవంబర్ 21న జోహన్నెస్‌బర్గ్‌లో

బలగం టీవీ, హైదరాబాద్

2027 వన్డే ప్రపంచకప్ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు జరగనుంది. టోర్నీ పూర్తి షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గురువారం కేప్‌టౌన్‌లో జరిగిన కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఈ ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

భారత్ తొలి మ్యాచ్‌ను డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో ఆడనుంది. అక్టోబర్ 7న కేప్‌టౌన్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా నిర్వహించే ఈ మెగా టోర్నీ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు కొనసాగనుంది. ఫైనల్ నవంబర్ 21న జోహన్నెస్‌బర్గ్‌లో జరుగుతుంది.

భారత్ గ్రూప్-ఎలో ఆస్ట్రేలియా, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, జింబాబ్వేతో పాటు మరో క్వాలిఫయర్‌తో కలిసి ఉంది. గ్రూప్-బిలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఇంగ్లండ్, బంగ్లాదేశ్, మరో క్వాలిఫయర్ ఉన్నాయి.

అక్టోబర్ 10న పాకిస్థాన్‌తో..

భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అక్టోబర్ 10న జోహన్నెస్‌బర్గ్‌లో జరగనుంది. ఆస్ట్రేలియాతో తొలి మ్యాచ్ ముగిసిన మూడు రోజులకే పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. అక్టోబర్ 14న ష్వానేలో అఫ్గానిస్థాన్‌తో, అక్టోబర్ 17న బ్లూమ్‌ఫాంటెయిన్‌లో తొలి క్వాలిఫయర్‌తో, అక్టోబర్ 24న విక్టోరియా ఫాల్స్‌లో జింబాబ్వేతో భారత్ ఆడుతుంది.

కొత్త ఫార్మాట్..

2027 ప్రపంచకప్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. రెండు గ్రూపుల్లోని 12 జట్లు ప్రధాన గ్రూప్ దశలో తలపడతాయి. ఒక్కో గ్రూప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-7 దశకు





చేరతాయి. రెండు గ్రూపుల్లో నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లలో మెరుగైన జట్టు కూడా సూపర్-7లోకి వస్తుంది. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 14 వరకు సూపర్-7 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ దశలో ప్రతి జట్టు ఆరు మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్ దశలో సాధించిన పాయింట్లు సూపర్-7కు బదిలీ కావు.

భారత్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్‌లను వరుసగా ఏ1, ఏ2, ఏ3గా సీడ్ చేశారు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంకలను బి1, బి2, బి3గా, ఇంగ్లండ్‌ను ఏబీ4గా ఉంచారు.

మళ్లీ ఆస్ట్రేలియా, పాక్‌తో..

భారత్ సూపర్-7కు అర్హత సాధిస్తే అక్టోబర్ 28న విక్టోరియా ఫాల్స్‌లో ఆస్ట్రేలియాతో, అక్టోబర్ 31న జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాతో, నవంబర్ 4న పార్ల్‌లో న్యూజిలాండ్‌తో ఆడనుంది. నవంబర్ 7న కేప్‌టౌన్‌లో పాకిస్థాన్‌తో మరోసారి తలపడే అవకాశం ఉంది. నవంబర్ 11న గ్కెబెర్హాలో ఇంగ్లండ్‌తో, నవంబర్ 14న దర్బన్‌లో శ్రీలంకతో భారత్ మ్యాచ్‌లు ఉన్నాయి.

సూపర్-7లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరతాయి. తొలి సెమీఫైనల్ నవంబర్ 17న కేప్‌టౌన్‌లో, రెండో సెమీఫైనల్ నవంబర్ 18న ష్వానేలో జరుగుతాయి. రెండు సెమీఫైనల్స్‌కు రిజర్వ్ డే ఉంటుంది. ఫైనల్‌కు నవంబర్ 22ను రిజర్వ్ డేగా కేటాయించారు.

అక్టోబర్ 2న టోర్నీ ఆరంభం

ప్రపంచకప్ అధికారికంగా అక్టోబర్ 2న నమీబియాలోని విండ్‌హోక్‌లో ప్రారంభమవుతుంది. ప్రపంచకప్ క్వాలిఫయర్‌లో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిరీస్‌లో తలపడతాయి. అక్టోబర్ 2, 4, 6 తేదీల్లో జరిగే ఈ రౌండ్ రాబిన్ పోటీల్లో అగ్రస్థానంలో నిలిచిన జట్టు ప్రధాన గ్రూప్ దశలో 14వ జట్టుగా చోటు దక్కించుకుంటుంది.

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల్లోని 12 వేదికల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లు జరుగుతాయి. నమీబియాలోని విండ్‌హోక్ క్రికెట్ గ్రౌండ్‌లో సూపర్ సిరీస్‌తో పాటు మూడు గ్రూప్ దశ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.



# 64 ఏళ్ల తర్వాత
# భారత రెజ్లర్ ఆసియా క్రీడల ఫైనల్లో!

## గ్రెకో-రోమన్ 97 కిలోల విభాగంలో నితేశ్ సివాచ్‌కు రజతం.. తండ్రితో కలిసి పాలు పోసిన స్థాయి నుంచి ఆసియా క్రీడల పతకం వరకు

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల గ్రెకో-రోమన్ రెజ్లింగ్‌లో భారత రెజ్లర్ నితేశ్ సివాచ్ చరిత్ర సృష్టించాడు. పురుషుల 97 కిలోల విభాగంలో రజత పతకం సాధించిన నితేశ్.. 64 ఏళ్ల తర్వాత ఆసియా క్రీడల గ్రెకో-రోమన్ ఫైనల్‌కు చేరిన తొలి భారత రెజ్లర్‌గా నిలిచాడు. నాగోయా సిటీ ఇనాయే స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన స్వర్ణ పతక పోరులో జపాన్‌కు చెందిన యూరి నకాజాటో చేతిలో 0-4తో ఓడిన నితేశ్ రజతంతో సరిపెట్టుకున్నాడు.

1962 ఆసియా క్రీడల్లో గణపత్ అండల్కర్ ఫైనల్‌కు చేరి స్వర్ణం సాధించిన తర్వాత.. మళ్లీ భారత గ్రెకో-రోమన్ రెజ్లర్ ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. దీంతో నితేశ్ సాధించిన రజతం భారత గ్రెకో-రోమన్ రెజ్లింగ్‌లో ఆసియా క్రీడల అత్యుత్తమ ప్రదర్శనల్లో ఒకటిగా నిలిచింది.

హర్యానాలోని జాగ్సీ గ్రామానికి చెందిన నితేశ్ 2012లో కబడ్డీ ఆడేందుకు ప్రతాప్ పాఠశాలలో చేరాడు. అయితే పాల వ్యాపారం చేసే తండ్రి ఆనంద్ తన కుమారుడు రెజ్లర్ కావాలనే కోరికతో అతడిని రెజ్లింగ్ వైపు ప్రోత్సహించాడు. సుమారు రెండేళ్లు శిక్షణ పొందిన అనంతరం నితేశ్ మోకాలికి తీవ్ర గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దీంతో దాదాపు రెండేళ్లు రెజ్లింగ్‌కు దూరమయ్యాడు. ఆ సమయంలో తండ్రితో కలిసి ఇంటింటికీ పాలు పంపిణీ చేస్తూ కుటుంబానికి అండగా నిలిచాడు.

అయితే రెజ్లింగ్‌ను వదులుకోని నితేశ్ తల్లిదండ్రులను మరోసారి అవకాశం ఇవ్వాలని కోరాడు. ఆరు నెలల సమయం ఇవ్వాలని అడగడంతో కుటుంబం అంగీకరించింది. ఆ తర్వాత స్కూల్ జాతీయ పోటీల్లో పతకం సాధించి తన పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. 2025 ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన నితేశ్.. 2026 ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచి మరింత మెరుగయ్యాడు.ఆసియా క్రీడల్లో క్వార్టర్‌ఫైనల్లో తుర్క్‌మెనిస్థాన్‌కు చెందిన అమన్‌బెర్డి అగమ్మదెదోవ్‌పై 7-1తో విజయం సాధించాడు. సెమీఫైనల్లో మంగోలియాకు చెందిన గంఖుయాగ్ గన్బాతర్‌ను 9-0తో ఓడించి సాంకేతిక ఆధిక్యంతో ఫైనల్‌కు చేరాడు. రజతం సాధించిన అనంతరం నితేశ్ మాట్లాడుతూ.. ''ఆసియా క్రీడల్లో రజతం గెలిచానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. నేను ఈ ప్రయాణం మొదలుపెట్టిన తర్వాత వెనక్కి చూడొద్దని, పతకంతో ఇంటికి రావాలని నాన్న ఎప్పుడూ చెప్పేవారు. ఈ రోజు ఆయన కోసం పతకం సాధించాను. నా విభాగంలో ఇంతకుముందు ఎవరూ పతకం సాధించలేదు. ఒత్తిడి ఉన్నప్పటికీ శిక్షణపై నమ్మకంతో పోరాడాను. నా దేశ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాను'' అని భావోద్వేగంగా చెప్పాడు.తన విజయ ప్రయాణంలో ఇన్‌స్పైర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్ అందించిన సహకారాన్ని కూడా నితేశ్ గుర్తుచేసుకున్నాడు. తండ్రితో కలిసి పాలు పంపిణీ చేసిన స్థాయి నుంచి ఆసియా క్రీడల వేదికపై నిలిచి పతకం సాధించడం వరకు నితేశ్ ప్రయాణం పట్టుదల, పునరాగమనానికి ప్రతీకగా నిలిచింది.

# ప్రసిద్ధ్ స్థానంలో అన్షుల్ కంబోజ్!

## వెస్టిండీస్‌తో ఆఖరి వన్డేకు ముందు టీమిండియాలో కీలక మార్పులు..

బలగం టీవీ, హైదరాబాద్

వెస్టిండీస్‌తో జరగబోయే మూడో వన్డేకు ముందు భారత క్రికెట్ జట్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గాయం కారణంగా ఫాస్ట్ బౌలర్ ప్రసిధ్ కృష్ణ జట్టుకు దూరం కాగా, అతని స్థానంలో చెన్నై సూపర్ కింగ్స్ (CSK) పేసర్ అన్షుల్ కంబోజ్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ గురువారం ప్రకటన విడుదల చేసింది. బుధవారం జరిగిన రెండో వన్డేలో బౌలింగ్ చేస్తుండగా ప్రసిధ్ కృష్ణ ఎడమ తొడ కండరాలు పట్టేయడంతో ఐదు ఓవర్లు మాత్రమే వేసి మైదానాన్ని వీడాడు. గాయం తీవ్రత దృష్ట్యా అతను సిరీస్‌కు దూరం కావడంతో సెలెక్టర్లు అన్షుల్ కంబోజ్‌ను జట్టులోకి తీసుకున్నారు. అతడు న్యూ ఛండీఘర్‌లో శనివారం జరగబోయే ఆఖరి వన్డే నాటికి భారత జట్టుతో కలవనున్నాడు.

టీ20 సిరీస్‌కూ మార్పులు.. వాషింగ్టన్ సుందర్ అవుట్: అటు వెస్టిండీస్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ భారత జట్టులోనూ బీసీసీఐ ఒక మార్పు చేసింది. ఆల్రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను టీ20 సిరీస్ నుంచి మినహాయించి, అతని స్థానంలో విప్రజ్ నిగమ్‌కు అవకాశం కల్పించింది. రాబోయే న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అక్టోబర్ 11 నుంచి ప్రారంభమయ్యే రంజీ ట్రోఫీలో సుందర్ ఆడితే అతనికి రెడ్ బాల్ ప్రాక్టీస్ లభిస్తుందనే ఉద్దేశంతోనే ఈ మార్పు చేసినట్లు బీసీసీఐ స్పష్టం చేసింది. కాగా, విండీస్‌తో జరుగుతున్న 3 వన్డేల సిరీస్‌ను భారత్ ఇప్పటికే 2-0తో కైవసం చేసుకోగా, చివరి వన్డే శనివారం న్యూ ఛండీఘర్ వేదికగా జరగనుంది.





వెస్టిండీస్‌తో మూడో వన్డేకు అప్‌డేటెడ్ భారత జట్టు: శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, గుర్నూర్ బ్రార్, మహమ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్, అన్షుల్ కంబోజ్.

వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు అప్‌డేటెడ్ భారత జట్టు: శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, విప్రజ్ నిగమ్, నమన్ ధీర్.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు 64 పతకాలు

## 10 స్వర్ణాలు, 23 రజతాలు, 31 కాంస్యాలతో ఎనిమిదో స్థానంలో భారత్

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల్లో భారత్ పతకాల సంఖ్య 64కు చేరింది. గురువారం ముగిసిన 12వ రోజు పోటీల అనంతరం భారత్ 10 స్వర్ణాలు, 23 రజతాలు, 31 కాంస్యాలతో మొత్తం 64 పతకాలు సాధించి పతకాల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

154 స్వర్ణాలు, 71 రజతాలు, 63 కాంస్యాలతో మొత్తం 288 పతకాలతో చైనా అగ్రస్థానంలో కొనసాగుతోంది. జపాన్ 59 స్వర్ణాలు, 79 రజతాలు, 79 కాంస్యాలతో 217 పతకాలతో రెండో స్థానంలో ఉంది. దక్షిణ కొరియా 30 స్వర్ణాలు, 30 రజతాలు, 53 కాంస్యాలతో 113 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది.

ఉజ్బెకిస్థాన్ 16 స్వర్ణాలు, 21 రజతాలు, 19 కాంస్యాలతో 56 పతకాలతో నాలుగో స్థానంలో ఉండగా.. ఇరాన్ 42 పతకాలతో ఐదో స్థానంలో, థాయ్‌లాండ్ 38 పతకాలతో ఆరో స్థానంలో, బహ్రెయిన్ 21 పతకాలతో ఏడో స్థానంలో ఉన్నాయి. భారత్ తర్వాత కజకిస్థాన్ 64 పతకాలతో తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది.

# ఎంజీ ఇండియన్ సూపర్ లీగ్‌గా ఐఎస్ఎల్

## మూడు సీజన్ల తర్వాత టైటిల్ స్పాన్సర్..
## అక్టోబర్ 10 నుంచి కొత్త సీజన్

బలగం టీవీ, హైదరాబాద్

2026-27 సీజన్‌లో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) పేరు 'ఎంజీ ఇండియన్ సూపర్ లీగ్'గా మారనుంది. బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియాతో ఐఎస్ఎల్ గురువారం టైటిల్ స్పాన్సర్ ఒప్పందాన్ని ప్రకటించింది. దీంతో మూడు సీజన్ల తర్వాత భారత ప్రీమియర్ ఫుట్‌బాల్ లీగ్‌కు మళ్లీ టైటిల్ స్పాన్సర్ వచ్చినట్లయింది.

2026-27 ఐఎస్ఎల్ సీజన్ అక్టోబర్ 10న ప్రారంభం కానుంది. ఈ సీజన్ నుంచి లీగ్ కొత్త క్లబ్ ఆధారిత వాణిజ్య దశలోకి ప్రవేశించనుంది. పూర్తి స్వదేశీ, ప్రత్యర్థి మైదానాల్లో జరిగే హోమ్-అండ్-అవే విధానంలో పోటీలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా క్లబ్‌లు తమ సొంత మైదానాల్లో, ప్రత్యర్థి జట్ల మైదానాల్లో మ్యాచ్‌లు ఆడనున్నాయి.

మూడు సీజన్ల తర్వాత టైటిల్ స్పాన్సర్ తిరిగి రావడం కీలక పరిణామమని ఐఎస్ఎల్ సీఈఓ కరణ్ యాదవ్ తెలిపారు. భారత ఫుట్‌బాల్‌పై ఉన్న నమ్మకం, అవకాశాలకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. క్లబ్‌ల ఆధారిత లీగ్‌గా మరింత బలమైన, వాణిజ్యపరంగా స్థిరమైన, అభిమానులకు మరింత చేరువైన ఐఎస్ఎల్‌ను నిర్మించడమే లక్ష్యమన్నారు.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వినయ్ రైనా మాట్లాడుతూ.. భారత్‌లో ఎంజీ ప్రయాణంలో ఫుట్‌బాల్‌కు




ప్రత్యేక స్థానం ఉందన్నారు. లివర్‌పూల్ ఎఫ్‌సితో భాగస్వామ్యంతో పాటు పఠాన్ బాలికల వంటి కార్యక్రమాల ద్వారా భవిష్యత్ ఫుట్‌బాల్ ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

# 'సిగ్మా' సినిమాపై నెగెటివ్ ప్రచారం






టాలీవుడ్ ట్యాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ నటిస్తోన్న లేటెస్ట్ సినిమా 'సిగ్మా'. తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ కుమారుడు జేసన్ విజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తెలుగమ్మాయి ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రాజు సుందరం, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న 'సిగ్మా' సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా మరికొన్ని గంటల్లో సిగ్మా సినిమ్ రిలీజ్ ఉండనుండగా, హీరో సందీప్ కిషన్ సోషల్ మీడియా వేదికగా ఒక సంచలన పోస్ట్ పెట్టాడు. సామాజిక మాధ్యమాల వేదికగా తమన సినిమాపై నెగెటివ్ ప్రచార చేయడంపై సందీప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'గత కొన్ని రోజులుగా నేను, నా కొత్త మూవీ లక్ష్యంగా పలువురు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్టులు పెట్టడం చూస్తున్నా. దీని వెనుక ఎవరున్నా, డబ్బులిచ్చి ఇలా ఎందుకు చేయిస్తున్నారో నాకు బాగా తెలుసు. ఇది ఇలాగే కొనసాగితే తగిన మూల్యం చెల్లించుకుంటారు. మీకో విషయం గుర్తు చేస్తున్నా, ఇలా చేస్తూ ఉంటే నాకంటే మీరే ఎక్కువ నష్టపోతారు. డైరెక్టర్ వివరాలు బయట పెడితే అందరూ దొరికిపోతారు మరి.. చూసుకోండి మరి' అంటూ ట్రోలర్లకు స్ట్రాంగ్ కౌంటరిచ్చారు సందీప్ కిషన్. కాగా ఇటీవల నాని నటించిన ది ప్యారడైజ్ సినిమా రిలీజ్ ముందు కూడా ఇలాగే నెగటివ్ క్యాంపెయిన్ జరిగింది. ఇప్పుడు మళ్లీ సిగ్మా సినిమా విషయంలో రిపీటయ్యింది. ఈ నేపథ్యంలో సందీప్ కిషన్ చేసిన ట్వీట్ ఇప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. సిగ్మా సినిమా విషయానికి వస్తే.. ప్రతిష్ఠాత్మక లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్, ఎన్.వి.ఆర్ సినిమా సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించగా.. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా వచ్చి చిత్రబృందాన్ని అభినందించారు. తమిళంతో పాటు తెలుగులోనూ ఒకేసారి రిలీజవుతోన్న సిగ్మాపై మంచి అంచనాలే ఉన్నాయి.

## ఫెడరేషన్ పెద్దలతో సుమలత వాగ్వాదం



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో వివాదం రాజుకుంది. డాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న విభేదాలు తారాస్థాయికి చేరాయి. గురువారం హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ముఖ్య నాయకుల సమావేశం జరుగుతుండగా, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలత లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, ఆమెను లోనికి అనుమతించకపోవడంతో ఫెడరేషన్ పెద్దలతో ఆమె తీవ్ర వాగ్వాదానికి దిగారు. డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఎన్నికైన తనను కీలక సమావేశానికి పిలవకపోగా, కనీసం లోపలికి కూడా రానివ్వకపోవడంపై సుమలత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ నాయకులు తమ సంఘం ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారంటూ ఫిల్మ్ ఛాంబర్ బయట ఆందోళన చేపట్టడంతో అక్కడ గందరగోళం ఏర్పడింది. ఇదిలా ఉండగా, ఇటీవల డాన్సర్స్ అసోసియేషన్‌లో తలెత్తిన వివాదాల నేపథ్యంలో సుమలత నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. అంతేకాకుండా, అక్టోబర్ 18న అసోసియేషన్‌కు కొత్తగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. అయితే, ఫెడరేషన్ తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం చట్టవిరుద్ధమని, తమను కావాలనే అణచివేస్తున్నారని సుమలత వర్గం ఆరోపిస్తోంది. మరోవైపు, ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై గతంలో విధించిన 'సహాయ నిరాకరణ' నిర్ణయాన్ని కొనసాగిస్తున్నట్లు ఫెడరేషన్ తేల్చి చెప్పింది. ఈ పరిణామాలతో డాన్సర్స్ అసోసియేషన్ వివాదం మరింత ముదురుతోంది. ఫెడరేషన్ చర్యలపై న్యాయపరంగా పోరాడతామని సుమలత, జానీ మాస్టర్ మద్దతుదారులు హెచ్చరిస్తున్నారు.

# అన్నీ మన చేతుల్లో ఉండవు..



నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ది ప్యారడైజ్'. ఇందులో జడల్ తల్లి పాత్రలో బాలీవుడ్ నటి సోనాలి కులకర్ణి నటించారనే సంగతి తెలిసిందే. సమ్మక్క అనే క్యారక్టర్ లో ఆమె అద్భుతంగా నటించారు. ఒక విధంగా సినిమా కథంతా ఆమె చుట్టూనే తిరుగుతుంది. అందుకే ఒకానొక సమయంలో ఈ చిత్రానికి 'సమ్మక్క' అనే టైటిల్ పెడితే ఎలా ఉంటుందో అని మేకర్స్ ఆలోచన కూడా చేశారు. సినిమాలో ఆమె పాత్రకు అంత ప్రాధాన్యత ఉంది. తాజాగా సోనాలి తన పాత్రపై, సినిమాపై వస్తున్న నెగెటివ్ టాక్ పై స్పందించారు. 'ది ప్యారడైజ్' మూవీకి ప్రీమియర్ షోల నుంచే డివైడ్ టాక్ ఉంది. విశ్లేషకుల నుంచి మిక్స్‌డ్ రివ్యూలు వచ్చాయి. సినిమా కోసం నటీనటులు ఎంత నిజాయితీగా కష్టపడి పనిచేసినా.. చివరకు ప్రేక్షకులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఎవరూ ముందుగా చెప్పలేరని సోనాలి కులకర్ణి అన్నారు. తుది ఫలితం మన చేతుల్లో ఉండదని, అలా అని కష్టపడడం మానేయకూడదని పేర్కొన్నారు. ప్రతి సినిమాకు ఒకే విధమైన రిజల్ట్ రాదని, ఈ విషయాన్ని గ్రహించాలని ఆమె అన్నారు. సినిమా రిజల్ట్ గురించి ముందే ఆలోచించకుండా, కేవలం తమ పనిపై మాత్రమే నటీనటులు దృష్టి పెట్టాలని, ఒక యోగిలా పని సోనాలి సూచించారు. 'ప్యారడైజ్'కు మొదటి రోజు నుంచే మిక్స్‌డ్ రివ్యూస్ వచ్చాయని, అయితే అదే సమయంలో సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి స్పందన అందుకోవడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు సోనాలి. ముఖ్యంగా నిర్మాతకు మంచి ఫలితం దక్కడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. "మనం ఎంత అంకితభావంతో పనిచేసినా, పాత్రలో ఒదిగిపోయినా, ఫలితం మన చేతుల్లో ఉండదు. కథలో ఆ పాత్ర ఎలా సరిపోతుంది?, దర్శకుడు ఆ పాత్రను ఎలా మలిచాడు? ఎడిటర్ ఎంత వరకు న్యాయం చేశాడు?, టెక్నికల్ అంశాలన్నీ కలిసొచ్చాయా లేదా? అనే దానిపై ఫలితం ఆధారపడి ఉంటుంది" అని సోనాలి అభిప్రాయపడ్డారు. సొనాలీ కులకర్ణి మరాఠీ, హిందీ, తమిళం, గుజరాతీ చిత్రాలతో పాటుగా ఇంగ్లీష్, ఇటాలియన్ భాషల్లోనూ నటించారు. గతంలో అక్కినేని నాగార్జున నటించిన 'అగ్నివర్ష్' అనే హిందీ సినిమాలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు 'ది ప్యారడైజ్' సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు, ఈశ్వరీ రావు, రాజా రవీంద్ర కీలక పాత్రల్లో కనిపించగా.. నానికి జోడీగా కయాదు లోహర్ నటించారు.

# ఓటీటీలోకి 'మహేంద్రగిరి వారాహి'




తెలుగులో మైథలాజికల్ థ్రిల్లర్ సినిమాలకు క్రేజ్ భారీగానే ఉంది. డివోషనల్ ప్లస్ మిస్టరీ థ్రిల్లర్ జానర్ లో సినిమాలు చాలా అద్భుతంగా ఉంటాయి. ఇటీవల వచ్చిన మాస్ మహారాజ రవితేజ ఇరుముడి సినిమా ఇదే జానర్ లో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అక్కినేని హీరో సుమంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మహేంద్రగిరి వారాహి' మూవీకూడా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ సాధించింది. సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా కొత్త కథ, కథనంతో ప్రేక్షకులను మెప్పించింది. ఒక రాజ వంశాన్ని వందల ఏళ్లుగా వెంటాడుతున్న ఓ వింత శాపం.. ఆ కుటుంబంలోని మగవాళ్లు 33 ఏళ్లు దాటగానే అనుమానాస్పద పరిస్థితుల్లో మరణిస్తుంటారు. అయితే అసలు ఈ శాపం ఎందుకు వచ్చింది..? దాని వెనుక మహేంద్రగిరి వారాహి అమ్మవారికి ఉన్న సంబంధం ఏంటి..? ఇలాంటి ప్రశ్నల చుట్టూనే కథ నడుస్తుంది. వినూత్నమైన స్టోరీ కావడంతో ప్రేక్షకులను మెప్పించింది. అయితే 'మహేంద్రగిరి వారాహి' మూవీ ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తోంది. అక్టోబర్ 2 న ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ వీడియో లో స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెల్లడైంది. ఇక ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానుంది. థియేటర్లలో ఈ మూవీని మిస్ అయినవాళ్లు ఎంచక్కా ఇంట్లోనే సినిమాను చూసే అవకాశం ఉంది. ఇక మహేంద్రగిరి వారాహి మూవీ కథ విషయానికి వస్తే..

సిద్ధార్థ్(సుమంత్) ఓ యూట్యూబర్.. తన అన్నయ్య రాజీవ్ పెళ్లి నేపథ్యంలో కుటుంబంతో కలిసి మహేంద్రగిరి ఆలయానికి వెళ్తాడు. అయితే అక్కడ అనుకోకుండా తన అన్నతో పాటు రాజవంశీయుడు ఎద్దు దాడిలో మరణిస్తారు. అదే సమయంలో సిద్ధార్థ్ కు దాదాపు 150 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన మహేంద్రగిరి ఆలయం గురించి కీలక విషయాలు తెలుస్తాయి. ఈ క్రమంలో గ్రామంలో అనూహ్యమైన పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఈ క్రమంలో తన అన్న చావుతో పాటు గ్రామంలో వరుస మరణాలపై సిద్ధార్థ్ స్వయంగా ఇన్వెస్టిగేషన్ మొదలుపెడతాడు. ఆయన ఇన్వెస్టిగేషన్ లో సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయి. ఈ మూవీలో వందల ఏళ్ల నాటి మహేంద్రగిరి ఆలయం, వారాహి అమ్మవారి శక్తి, రాజవంశానికి చెందిన గతం, ఎవరూ ఊహించని విధంగా వరుస మరణాలు.. ఇలా వీటి మధ్య నడిచే డ్రామా రక్తి కట్టిస్తుంది.



## నవంబర్ 13న థియేటర్లలోకి 'గీతాంజలి'

అక్కినేని నాగార్జున కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోయిన క్లాసిక్ రొమాంటిక్ డ్రామా 'గీతాంజలి' రీ-రిలీజ్‌కు తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని 4కే డిజిటల్ వెర్షన్‌లో నవంబర్ 13న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్ అధికారికంగా ప్రకటించింది. గతంలో ఈ చిత్రాన్ని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 28న విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అయితే, పిక్చర్, సౌండ్ క్వాలిటీని మరింత మెరుగుపరిచేందుకు అదనపు పునరుద్ధరణ పనులు అవసరం కావడంతో విడుదల వాయిదా పడింది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న అభిమానులకు చిత్రబృందం ఇప్పుడు కొత్త తేదీతో స్పష్టత ఇచ్చింది. 1989లో విడుదలైన 'గీతాంజలి' అప్పట్లో ఓ సంచలనం. ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెలుగులో నేరుగా దర్శకత్వం వహించిన ఏకైక చిత్రం ఇదే కావడం విశేషం. నాగార్జున-గిరిజ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీతో పాటు ఇళయరాజా సంగీతం, పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రఫీ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. దాదాపు 37 ఏళ్ల తర్వాత ఈ క్లాసిక్ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో 4కే టెక్నాలజీతో మళ్లీ పెద్ద తెరపైకి తీసుకురానున్నారు. శ్రీ పద్మిని సినిమాస్ ఈ చిత్రాన్ని పంపిణీ చేయనుంది.